1.12.1995 శుక్రవారం 12 పేజీలు సంపుటి:67 సంచిక:46 విడిప్రతి రూ. 2.00 లు Phone: 27354 Regd. No. HNL 18

జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

అత్త జోరుకు అల్లుడి బేజారు!

లక్ష్మిపార్వతి మళ్లీ రాజకీయ తెర మీదకు రావడంతో ఎన్టీఆర్ శిబిరంలో కలకలం మొదలైంది. లక్ష్మిపార్వతి రాజకీయ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్న డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వర రావు, ఆయన మద్దతుదార్లకు నవ్వాలో, ఏడ్వాలో అర్థంకాక తలలు పట్టు కూర్చున్నారు. చంద్ర బాబు నాయుడు మాత్రం లక్ష్మిపార్వతి రాజకీయ అరంగేట్రం పట్ల యమ ఆనందంగా వున్నారు. లక్ష్మిపార్వతి తెలుగు దేశం పార్టీకి "ఐరన్ లెగ్" అని ఇప్పటికే తేలిపోయింది. అసలే కొన ప్రాణంతో మినుకు మినుకు మంటున్న ఎన్టీఆర్ శిబిరంలో ఈ పరిణామం మరో చిలికకు దారి తీయగలదని, దీనితో వచ్చే లోకసభ ఎన్నికల్లో ఎన్టీఆర్ నామ మాత్రులై పోతారని చంద్రబాబు ఆశపడ్తున్నారు. "ఐనప గజ్జెల తల్లి" పది కాలాలు ఎన్టీఆర్ శిబిరంలో రాజకీయం చేయాలని చంద్రబాబు మనస్ఫూర్తిగా కోరు



కుంటుండగా, డాక్టర్ దగ్గుబాటి మాత్రం ఈ పరిణామం వల్ల "అస్త్ర సన్యాసం" చేయక తప్పదేమో నని భయపడ్తున్నారు. జన చైతన్య వేదిక పేరిట లక్ష్మిపార్వతి నగరంలో పెద్ద సభ పెట్టి అందులో చిన్నల్లుడి ఎడా పెడా తిట్టి మరీ

లక్ష్మిపార్వతి రంగప్రవేశంతో దగ్గుపాటికి రాజకీయ అస్త్రసన్యాసం తప్పేట్లు లేదు!

రాజకీయాల్లోకి తిరిగి అడుగు పెట్టడం వెనుక ఎన్టీఆర్ బోసి నవ్వుల దీవెన లున్నాయి. తన అధికార పీఠం కబళించిన అల్లుళ్ల భరతం పట్టాలంటే లక్ష్మిపార్వతి రంగ ప్రవేశం తప్పదని ఎన్టీఆర్ భావించారు. అందుకే జన



చైతన్య వేదిక పేరిట హంగు - ఆర్భాటాలు కల్పించి, పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించి లక్ష్మిపార్వతికి దేశం అర్థ సింహాసనాన్ని ధారాదత్తం చేశారు. ఇక లక్ష్మిపార్వతి లేకుండా ఎన్టీఆర్ రాజకీయం లేదని ఆయన బహిరంగంగానే అంటున్నారు. లక్ష్మిపార్వతి నాయకత్వంలో పని చేయటానికి ఇష్టపడని వారు తన శిబిరం నుంచి నిష్క్రమించ వచ్చని ఆయన అన్యాపదేశంగా అంటున్నారట. పాపం దగ్గుబాటి పరిస్థితి దీనితో కుడితిలో పడ్డ ఎలుకలాగా తయారైంది. లక్ష్మిపార్వతి నాయకత్వాన్ని ఆమోదించి అవమానాలు సహిస్తూ అక్కడే పడి వుండడం కష్టం. అలాగని ఎన్టీఆర్‌ను విభేదించి బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. డాక్టర్ దగ్గుబాటిని ఆయన తోడల్లుడు చంద్రబాబు ఛీ కొడ్తున్నారు. తిరిగి చంద్రబాబు దగ్గరకు వెళ్లలేక,

కొరవ 10 పేజీలో

రిలయన్స్ షాక్‌తో మార్కెట్ దిమ్మ తిరిగింది!

దేశంలో కెల్లా అతి పెద్ద వ్యాపార సంస్థ, అత్యధిక సంఖ్యలో షేర్ హోల్డర్లు కలిగిన కంపెనీ - రిలయన్స్ ఇండస్ట్రీస్ తమ షేర్‌ను బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి లిస్టింగ్ నుంచి ఉపసంహరించు కున్నది. రెండున్నర కోట్ల మంది షేర్ హోల్డర్లు కలిగిన కంపెనీ ఇది. ప్రపంచంలో ఇంత మంది షేర్ హోల్డర్లు మరే కంపెనీకి లేరు. బొంబాయిలో స్టాక్ ఎక్స్ఛేంజిలో రోజూ జరిగే వ్యాపారంలో 60 శాతం వరకు రిలయన్స్ షేర్ల పైనే వుంటుంది. బిఎస్ఇ ఇండెక్స్‌కు ప్రధాన ఆధారం రిలయన్స్. ఇంత ప్రాధాన్యత కల్గిన కంపెనీ [illegible] ఎక్స్ఛేంజి స్పెసిఫైడ్ లిస్ట్ నుంచి తప్పు కోవడం షేర్ మార్కెట్‌కు [illegible] ఈ నిర్ణయం అమలులోకి వస్తే బిఎస్ఇ ఇండెక్స్‌కు అర్థం లేకుండా పోతుంది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి ప్రాధాన్యతే కొంత వరకు తగ్గిపోతుంది.

ఇంతటి తీవ్రమైన నిర్ణయానికి కారణం - స్టాక్ ఎక్స్ఛేంజిలోని కొందరు డైరక్టర్ల స్వార్థం కావడం దురదృష్ట కరం. ఈ డైరక్టర్లలో కొందరికి రిలయన్స్ షేర్ పై స్పెక్యులేటివ్ వ్యాపారం వుంది. వారు తమ స్వంత లాభాలు పెంచు కోవడానికి రిలయన్స్ షేర్ ధరను పతనం చేసు నను కట్టారు. ఆ పథకంలో భాగంగా డూప్లికేట్ షేర్ల సాకు చూపి మూడు రోజుల పాటు రిలయన్స్ షేర్ల పై ట్రేడింగ్ నిలిపి వేశారు. దాని ప్రభావంతో షేర్ ధర దారుణంగా పడిపోయింది.

ఈ పథకం రిలయన్స్ అధినేత ధీరూభాయి అంబానికి ఆగ్రహం తెప్పించింది. దానితో ఆయన తన కంపెనీనే స్టాక్ ఎక్స్ఛేంజి నుంచి తొలగించాలని నిర్ణయించారు. ఇప్పుడు

డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్

షేర్ ధర కేవలం రూ. 195లు.

అసలే పలు రకాల సమస్యలతో క్రుంగి పోయి వున్న షేర్ మార్కెట్ ఈ పరిణామంతో అట్టడుగుకు దిగజారి పోయింది. ఇప్పుడు ఇండెక్స్ 2900 పాయింట్లు. ఇది మరొక నాలుగు రోజులలో 2700 కి పడి పోయేట్లుంది పరిస్థితి చూస్తే! ఈ పరిణామాల వల్ల షేర్ మార్కెట్‌లో మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ 3 లక్షల కోట్ల వరకు నష్ట పోయిందని అంచనా. కొన్ని లక్షల మంది ఇన్వెస్టర్లు, మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకులు విపరీతంగా నష్ట పోయాయి. [illegible] దెబ్బ తిన్నాయి.

రిలయన్స్ షేర్‌ను స్పెసిఫైడ్ లిస్ట్ నుంచి తప్పించినా, పర్మిటెడ్ విభాగంలో బొంబాయి ఎక్స్ఛేంజిలోనే ట్రేడ్ చేసుకోవచ్చు. అందువల్ల ఇన్వెస్టర్లకు ఇబ్బంది లేదు. కానీ, రిలయన్స్ వంటి అతి పెద్ద కంపెనీలనే బ్రోకర్లు తమ కనుకూలంగా ఆట ఆడించ గల్గుతున్నా రంటే, ఇక చిన్న చితక కంపెనీల పరిస్థితి ఏమిటి అన్నది ఆలోచించాలి.

కేంద్రమంత్రి బూటాసింగ్ నుంచి నాణ్యతా అవార్డు స్వీకరిస్తున్న సీతారామయ్య

జాతీయ నాణ్యతా అవార్డు పొందిన నెల్లూరు పారిశ్రామికుడు!

నెల్లూరు యువకుడికి చెందిన సుసీరా ఇండస్ట్రీస్, నాణ్యతా ప్రమాణాల నిర్వహణలో 'రాజీవ్ గాంధీ నేషనల్ అవార్డ్ ఫర్ క్వాలిటీ' బహుమతికి అర్హమైంది.

మద్రాసులో వుంది పరిశ్రమ. అశోక్ లేలాండ్, ఇతర ఆటో మొబైల్ కంపెనీలకు పుష్ రాడ్స్ వంటి పరికరాలు సరఫరా చేయడం దీని కార్యకలాపం. పెట్టుబడి రీత్యా చిన్న పరిశ్రమ అనేకాని, నాణ్యత విషయంలో పెద్ద సంస్థలతో పోటీ పడగల్గిన స్థాయికి ఎదిగింది. ఐఎస్ఒ 9002 సర్టిఫికెట్ పొందిన తొలి చిన్న పరిశ్రమ ఇది. ఆటో మొబైల్ విడిభాగాల ఉత్పత్తి దారుల సంఘం ఇచ్చే క్వాలిటీ అవార్డును సైతం వీరు స్వంతం చేసుకున్నారు.

నెల్లూరు జిల్లా యల్లాయ పాలెంకు చెందిన సీతారామయ్య ఈ పరిశ్రమ నిర్వాహకుడు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివి, వుద్యోగాల కోసం వెంపర్లాడ కుండా స్వంత పరిశ్రమ పెట్టుకొని, స్వయం కృషితో పైకెదిగిన ఔత్సాహిక పారిశ్రామికుడు. తమిళనాడు బ్రాహ్మణ సంఘానికి సీతారామయ్య ఉపాధ్యక్షుడు కూడా! మద్రాసులోని తెలుగు ప్రముఖుడుగా ఇటీవలే ఆయన ఉగాది పురస్కారం స్వీకరించారు. ఆయన వయస్సు 50 సంవత్సరాలు.

స్వయంకృషితో పారిశ్రామికంగా ఎదగడమే కాకుండా, జాతీయ స్థాయి గుర్తింపునూ పొంద గల్గిన సీతారామయ్య గారికి మా అభినందనలు.

ఆందోళనకరం

షేర్ మార్కెట్ పరిస్థితి చాలా ఆందోళన కరంగా వుంది. దేశంలో రాజకీయ అస్థిరత పెరిగి పోయింది. బ్యాంకు అప్పులకు వడ్డీ రేట్లు పెరిగాయి. అందువల్ల చాలా కంపెనీల లాభాలు తగ్గిపోతాయి. ప్రభుత్వానికి కూడా చాలినంత మొత్తంలో అప్పు పుట్టడం లేదు. 14 శాతం వడ్డీతో 1500 [illegible] ఆఫర్ చేస్తే కేవలం 750 [illegible] వచ్చాయి. ప్రభుత్వ పరంగా 14 శాతం వడ్డీ అంటే చాలా ఎక్కువ. దీన్ని బట్టి ప్రభుత్వం డబ్బుకు ఎంత కటకట లాడుతున్నది అర్థం చేసుకోవచ్చు.

చాలా ప్రాజెక్టులు నిధులు లేక సగంలో నిర్మాణం ఆగి పోతున్నాయి. పవర్, ఇర్రిగేషన్ ప్రాజెక్టులు, స్టీలు ఫ్యాక్టరీలు నిధుల కొరతకు అధికంగా గురౌతున్నాయి. ఇదే పరిస్థితి మరి కొంత కాలం కొనసాగితే పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థిరమైన ప్రభుత్వం ఏర్పడినా ఆర్థిక ఇబ్బందులు [illegible] ఆ దుస్థితే ఏర్పడితే షేర్ మార్కెట్ భవిష్యత్ ప్రశ్నార్థకమే! ఇన్వెస్టర్లు చాలా కాలమే ఎదురు చూడవలసి వచ్చేట్లుంది - మంచి రోజుల కోసం!

స్టేట్ బ్యాంక్ షేర్ ధర పతనం

స్టేట్ బ్యాంక్ షేర్ 27 తేది ఒకేసారి రు. 220ల నుంచి రు185 లకు [illegible]పోయింది. ఆ రోజే స్టేట్ బ్యాంకు తన అర్థ సంవత్సర ఫలితాలు ప్రకటించింది. ఫలితాలు బాగాలేవు. గత ఏడాదితో పోల్చి చూస్తే 78 కోట్ల లాభం

కొరవ 7 పేజీలో

సభ్యులందరికీ ప్లాట్లు ఇచ్చేస్తాం!

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసాల గురించి గత రెండు వారాలుగా జమీన్‌రైతులో ప్రచురితమైన వార్తలకు, రఘువీర్, పార్థ తదితర రియల్ ఎస్టేట్‌ల నిర్వాహకులు శ్రీ ఆనంద కుమార్ వివరణ పంపారు.

వీరు నిర్వహించే రఘువీర్ రియల్ ఎస్టేట్ పైనే జనంలో పలు అనుమానాలు, ఆరోపణలు వచ్చాయి. స్కీం పూర్తి అయినా ప్లాట్లు రిజిష్టర్ చేయడం లేదన్న అలజడి అధికంగా వుంది. అయితే ఆ భయాలు అవసరం లేదని, సభ్యులందరికీ ప్లాట్లు రిజిష్టర్ చేసి ఇస్తామని ఆనంద కుమార్ చెప్తున్నారు. మొత్తం 1800 మంది సభ్యులున్నారట. 700 మంది వరకు రిజిష్ట్రేషన్ పూర్తయి పోయింది. తక్కిన వారికి డిసెంబరు 30 తేది నుంచి రిజిష్ట్రేషన్ జరిపించేందుకు హామీ ఇస్తున్నాడు ఆనంద కుమార్. మొత్తం భూమిలో గ్రామనత్తం, పోరంబోకు వంటివేవీ లేకుండా పట్టా పొలమే ఇస్తామని చెప్తున్నాడు. మద్రాసులోని తన పార్థ స్కీంల పై కూడా పెద్దగా వివాదాలు లేవని, రిజిష్ట్రేషన్ ఆలస్యం కావడం తప్ప ఏనాడూ మోసం చేయలేదని వివరణ ఇస్తున్నాడు. తనపై ఎటువంటి కేసులూ లేవన్నది ఆనంద కుమార్ వాదన.

డబ్బు కట్టిన వారికి ప్లాట్లు ఇచ్చేయ గల్గితే విమర్శలకు ఆస్కారమే వుండదు కదా?

ఉత్తరాకాశంలో నల్ల మబ్బులు

ఉత్తరప్రదేశ్ మునిసిపల్ ఎన్నికల ఫలితాలు చాలా ఆందోళన కరంగా వెలువడ్డాయి. లౌకిక, ప్రజాస్వామిక వాదులకు భయం కల్గించే రీతిలో వున్నాయవి.

11 కార్పొరేషన్లు, 418 నగర పంచాయితీలు, 196 పాలికా పరిషత్‌లకు జరిగిన ఎన్నికలలో బిజెపి తక్కిన పార్టీలను చీపురతో చెత్తను చిమ్మి అవతల పారేసినట్లు పారేసింది. 11 కార్పొరేషన్లకు గాను ఎనిమి దింటిని మంచి మెజారిటీతో గెల్చుకున్నారు వారు. సాధారణమైన గెలుపు కాదది. ఐదేళ్ల క్రితం 1989 లో జరిగిన ఎన్నికలలో వారికి దక్కింది కేవలం రెండు కార్పొరేషన్లు మాత్రమే. ఇప్పుడు ఎనిమిది వచ్చాయి. ఇవి కాక అలహాబాద్, మీరట్‌లలో మేయర్ అభ్యర్థులు ఓడిపోయి నప్పటికీ, అధిక శాతం కార్పొరేటర్లుగా వారే గెల్చారు. అంటే ఇంచు మించు 90 శాతం కార్పొరేషన్లలో వారిదే ఆధిక్యత. మరీ విచిత్రమైన విజయం - ముస్లింలు అధిక సంఖ్యలో కల్గిన అలీఘర్, బిఎస్‌పి దళిత ప్రాబల్యం కల్గిన ఆగ్రాలలోనూ బిజెపి గెలవడం.

నగర పంచాయితీలు, పరిషత్‌లలో 70 శాతం బిజెపి పరమైనాయి. కాంగ్రెసు, బిఎస్‌పి, ములాయం సింగ్ గారి సమాజ్ వాది పార్టీతో సహా అన్ని ఇతర పార్టీలు బిజెపి ధాటికి వెలవెల పోయాయి. బిజెపి ఓడిపోయిన చోట కూడా, బిజెపి తిరుగు బాటు అభ్యర్థులు కారణం కావడమో, లేదా స్వతంత్ర అభ్యర్థులు గెలవడమో గమనార్హమైన విషయం.

మొత్తం ఉత్తర ప్రదేశ్ పట్టణ ఓటర్లు బిజెపి పార్టీని వరించా రన్నది ఈ ఫలితాలలో స్పష్టమై పోయింది. కాంగ్రెస్ పరిస్థితి మహా ఘోరం. ఒక్క కార్పొరేషన్ ఆ పార్టీకి దక్కలేదు. కనీసం కార్పొరేటర్లను గెల్పించు కోవడమూ వారికి చేతకాలేదు. నగర పంచాయితీలలో తివారి గారి తిరుగుబాటు కాంగ్రెస్ కంటె హీనంగా ప్రజల చేత తిరస్కరింప బడింది కాంగ్రెస్. సిపిఐ, సిపిఎం పార్టీల చిరునామాలు దొరకలేదు.

చాలా ఆందోళన కల్గించే పరిణామం ఇది. ఉత్తర ప్రదేశ్, దేశ రాజకీయాలను అమితంగా ప్రభావితం చేయగల్గిన రాష్ట్రం. 85 ఎమ్పీ సీట్లు కల్గిన అతి పెద్ద రాష్ట్రం ఇది. నాలుగు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న సమయంలో ఉత్తర ప్రదేశ్ పట్టణ ఓటర్లందరూ ఏకగ్రీవంగా బిజెపిని తమ పాలక పార్టీగా గుర్తించడం; కాంగ్రెస్‌ను అనామక పార్టీగా తిరస్కరించడం నిజంగా ఆందోళన పడవలసిన విషయమే. బిజెపి వంటి మతతత్వ పార్టీ ఇంతగా ప్రజాదరణను ఎట్లా పొంద గల్గుతున్నదో. లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించ గల ఏకైక మహావ్యక్తిగా ఇంత కాలం పరిగణింప బడిన కాంగ్రెస్ ఎందుకంత హీనస్థితికి నెట్టి వేయబడిందో అర్థమే కావడం లేదు.

పార్లమెంట్ ఎన్నికలకు ఈ ఫలితాలు సూచన అనుకొంటే, జరగనున్న అనర్థం కళ్లకు కట్టినట్లు కన్పిస్తూంది. ఇప్పటికే రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర వంటి ముఖ్య రాష్ట్రాలలో బిజెపి పెత్తనంలో వుంది. వారి బలం ఇంకా పెరిగితే ఢిల్లీ కోట మీద కాషాయి జెండా ఎగుర వేసే ప్రమాదం వుంది.

కాంగ్రెస్ నిద్రమత్తు వీడ వలసిన ఆపత్సమయం ఇది. నికరంగా ఫలానా రాష్ట్రంలో గెల్చి తీరుతామని చెప్పడానికి ఒక్క పేరూ స్ఫురించని దయనీయ స్థితిలో పడిపోయింది కాంగ్రెస్. బిఎస్‌పి, బిజెపి మిశ్రమ ప్రభుత్వ పతనం తర్వాత ప్రజలలో పోయిన ప్రతిష్ఠ పున రుద్ధరించుకొని ఉత్తర ప్రదేశ్‌లో కొద్దో గొప్పో బలం సంతరించు కొంటుందని ఆశించిన వారిని ఆ పార్టీ తీవ్రంగా నిరాశ పరిచింది. యుపి, బీహార్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక వంటి పెద్ద రాష్ట్రాలలో కాంగ్రెస్ జవసత్వాలు సమకూర్చు కోలేక పోతే పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కొనే దెట్లా? ఏమిటి ఈ దుస్థితికి కారణం?

అయోధ్య విషయంలో ప్రధాని అనుసరించిన అనుమానాస్పద వైఖరి, ధనికులను మరింత ధనవంతులను చేయడానికి తప్ప జన బహుళ్యానికి ఏ మాత్రం వుపకరించని ఆర్థిక సంస్కరణలు, అదుపు తప్పి విచ్చలవిడిగా పెరిగి పోతున్న ధరలు కాంగ్రెస్‌ను ప్రజల మనసుల నుంచి తుడిచి వేయడానికి కారణమౌ తున్నట్లున్నాయి. అయోధ్య విషయంలో ప్రధాని చేసిన తప్పుకు మొత్తం కాంగ్రెస్ పార్టీ శిక్ష అనుభవిస్తున్నది. ఇటు ముస్లింలు, అటు హిందువులు కూడా కాంగ్రెస్ లౌకిక తత్వాన్ని విశ్వసించ లేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంటున్నది.

జమీన్‌రైతు

ఏమిటి దీనికి పరిష్కారం? ఏమి చేస్తే, ఏ ప్రాయశ్చితం జరిగితే పాత పాపాలు పరిహార మౌతాయి? కాంగ్రెస్ మీద కక్షతో, సరైన లౌకిక ప్రత్యామ్నాయం లేని పరిస్థితులలో ప్రజలు బిజెపిని వరిస్తు న్నట్లున్నారు. కానీ అణువణువునా హిందూ మత తత్వం మూర్తీ భవించిన బిజెపి ఢిల్లీలో పెత్తనానికి వస్తే దేశం ఏమై పోతుంది? రాజ్యాంగంలో నిర్దేశించిన లౌకిక ప్రజాతంత్ర రాజ్య నిర్వహణ అనే మౌలిక లక్ష్యానికే భంగం కలగదా?

పార్టీల కతీతంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమైతే తప్ప ఈ మత వాదులను నిరోధించడం అసాధ్యం. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, జనతా, సమాజ్ వాది వంటి పార్టీలన్నీ కలిసి బిజెపికి సమైక్య ప్రతిఘటన ఇవ్వవలసిన సమయమిది. కాని అది సాధ్యమా? - ఒక రాజకీయ ఆశగా ఈ కలయికను వూహించడం వీలౌ తుందేమో కాని, వాస్తవంలో అటువంటి పరిణామం జరుగు తుందను కోవడం కల్ల!

ఉత్తర ప్రదేశ్‌లో ఎదురైన దారుణ ఓటమి పరాభవం కనీసం కాంగ్రెస్ పార్టీ నేతలలో, ప్రధాని పివిలోనైనా మార్పు తెగల్గితే కొంతకు కొంత మేలు జరుగుతుంది.

జమీన్‌రైతు

30.11.1945

వెల: 0-1-6 పేజీలు:8

పల్లెటూళ్లు

ముత్తుకూరురోడ్డు

వెంకటగిరి జమీన్‌రైతుల దౌర్భాగ్యమున్నూ మా రోడ్డు యొక్క దౌర్భాగ్యమున్నూ ఒకే బ్రహ్మదేవుడు వ్రాశాడు కాబోలు! ఆ గీటును తుడిచి వేయగల అభినవ బ్రహ్మ దేవుడవైన జిల్లా బోర్డు ప్రెసిడెంటు గారూ! మీ స్వంత రెండు కళ్ళతో చూచి బాగు చేయించవయ్యా?

నెల్లూరు జిల్లా వుద్యోగులు

2 సెక్షన్ ఓవర్‌సీర్ గారిని గూర్చి మేము బహిరంగంగా ఏమని చెప్పేది? యింజనీరు దొరా! వీరిని మరెక్కడికైనా బదలాయించి మమ్ము లను రక్షించండి. కలాసుల సంగతి తరువాత చెప్తాను.

అగ్గిపెట్టె అణా

రాపూరుతా. గుండవోలులో మిరియాల రంగయ్య శెట్టి అగ్గి పెట్టెకు 0.1.0 తీసుకున్నారు. రశీదు గూడా యిచ్చాడు. సబ్ కలెక్టరుకు యీ విషయం రిపోర్టు చేశాను. అధికార్లు చర్య బుచ్చుకొమ్మని ప్రార్థన.

11 పర్యాయములు రక్తదానము చేసిన వ్యక్తి

వెంకటగిరి వాస్తవ్యులున్ను నెల్లూరు రిక్రూటింగ్ ఆఫీసర్ శ్రీపురం వెంకట నరసింహా రావు, B.A., B.L. గారు రక్త నిధికి (Blood Bank) తమ రక్తమును 11 మారులు దానము చేసినారు. వ్యాయామ విద్యలో కూడా డిప్లమోను పొంది యున్నారు. ఈ రాజధానిలో రక్తదానము చేసిన వారి మీరు ప్రథములు. యీ రక్తమును యుద్ధములో గాయపడిన వారికే గాక ప్రమాదములు వగైరాలు జరిగి రక్త స్రావము మున్నగు కారణములచే క్షీణించి నపుడు ఈ రక్తమును ఆ వ్యక్తికి ఎక్కించి అట్టి వ్యక్తుల ప్రాణముల కాపాడుట కుపయోగ పడును. రక్తదానం వలన ఇచ్చిన వారి కేలాటి ప్రమాదము లేదని నరసింహా రావు గారనుభవ పూర్వకముగ చెప్పుచున్నారు.

50 ఏళ్ళ క్రితం ఈ వారం

నెల్లూరుముచ్చట్లు

నెల్లూరు సర్కిల్

తామస్ అనుభవించి పోయిన నెల్లూరు సర్కిల్ స్థానానికి, వెంకటగిరిలో వున్న చంద్రమౌళి గారు 6 తేది వస్తున్నారు. మౌళి గారు వెంకటగిరి వదలి పెడు తున్నందుకు సంతోషించినా, నెల్లూరుకు వస్తున్నందుకో?

తరువాయి 10వ పేజీలో

ఎరువుల ధరలు పెంచడం అన్యాయం!

జిల్లాలో ఒక వైపు ఎరువులు సక్రమంగా లభించక రైతులు అల్లాడి పోతున్నారు. ఈ తరుణంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడం అన్యాయం. ఇప్పటి వరకు జిల్లాలో వర్షాలు పడక పోవడం వల్ల నాన్ డెల్టా ఏరియాలో వ్యవసాయం చేయడం కనాకష్టమై పోయి వుంది. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలేక ఒక ప్రక్క రైతులు అల్లాడి పోతుంటే ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలు తరచు పెంచుతూ పోతూ వ్యవసాయం పై ఆధార పడ్డ రైతుల జీవితాలతో ప్రభుత్వాలు ఆటలాడు కొంటున్నాయి.

ఆత్మకూరు -పి. వెంకయ్య

మల్లేశ్వరికి అభినందనలు

ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మూడు స్వర్ణ పతకాలు సాధించడమే కాక, ప్రపంచ రికార్డు సాధించిన కరణం మల్లేశ్వరికి అభినందనలు. మల్లేశ్వరి ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఈ స్థితికి ఎదిగారు. భారత దేశంలో క్రీడా కారులను ప్రభుత్వాలు ప్రోత్సహించవు. అందువల్లే ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేక ఎందరో క్రీడాకారులు మరుగున పడిపోతున్నారు. మల్లేశ్వరికి రాష్ట్ర ముఖ్యమంత్రి కొన్ని ప్రోత్సాహకాలు కల్పించడం అభినందించ తగ్గ విషయం. రాష్ట్రంలో వున్న స్పోర్ట్స్ అథారిటీ స్కూళ్ల పని తీరును మెరుగు పర్చి ఆంధ్ర దేశంలో మల్లేశ్వరి వంటి ఎన్ని క్రీడా రత్నాలు బయట పడతాయో?

నెల్లూరు -పి. జేమ్స్

జనవాణి

కరెంట్ కోత టౌన్‌లో ఈ విధమైతే అనుకూలం

రాష్ట్ర వ్యాపిత విద్యుత్ కోతలో భాగంగా విద్యుత్ శాఖాధి కారులు టౌన్‌లో కోత వేళలు ప్రకటించారు. ఉదయం 7.30 నుంచి 10.30 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు విద్యుత్ కోతను అమలు పరుస్తున్నారు. ఈ వేళలు టౌన్ వాసులకు అంత అనుకూలంగా లేవు. టౌన్ వాసులు సామాన్యంగా ఏడు గంటల పైన నిద్రలేస్తారు. ఆఫీసులు, స్కూళ్లకు పోయేందుకు తయారయ్యే సమయంలో విద్యుత్ పోవడం వల్ల అనేక ఇబ్బందులు పడాలి. అదే విధంగా సాయంత్రం ఆఫీసుల నుంచి, స్కూళ్ల నుంచి పిల్లలు ఉసూరు మంటూ వచ్చేసరికి విద్యుత్ వుండదు. ప్రభుత్వం ఎలాగూ ఎక్కువగా విద్యుత్ వినియోగించే వేళల్లో కోత విధించడం లేదు. అందువల్ల ఉదయం

తరువాయి 10 పేజీలో

అర్జీల ఖర్చు 403 కోట్లు- ఎక్కడుంది ఇంత డబ్బు?

ఈనెల మొదటి వారంలో జిల్లాలో నిర్వహించిన ప్రజల వద్దకు పాలన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలకు సంబంధించిన పనులు చేపట్టేందుకు, వాటికయ్యే వ్యయానికి సంబంధించిన అంచనాలు తయారు చేసారు. ఎక్కడ నుండి ఎన్ని అర్జీలు వచ్చాయి; ఎంతెంత ఎక్కడ ఖర్చు పెట్టాలన్న వివరాలను, 25 తేది ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీ అనిమల గిరిధర్ సమీక్షించారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణాధికారి దయాచారిని మార్చి రాష్ట్ర సమాచార శాఖ కార్యదర్శి జి.వి. మూర్తిని కొత్తగా ఇక్కడకు వేసారు. ఐఎఎస్ అధికారియైన దయాచారికి గతంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవముంది. ఏ పనికి ఎటువంటి ప్రాముఖ్యత ఇవ్వాలో బాగా తెలిసిన అధికారి. కాని పనుల లోలికి పోకుండా అంకెల గారడి చేసే వాళ్లు ఉండాలనేమో ప్రాధాన్యతలేని సమాచార శాఖ నుంచి ప్రత్యేక అధికారిని పంపించారు.

ప్రజల వద్దకు పాలనలో 1,71,534 అర్జీలు వచ్చాయట. వీటిలో పట్టణ ప్రాంతాలకు సంబంధించి 57,971, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 1,31,563 అర్జీలు వున్నట్లు కలెక్టర్ చెప్పారు. సామాజిక అవసరాలకు సంబంధించి 11,301 అర్జీలు రాగా ఈ పనులు చేపట్టేందుకు 403 కోట్ల 50 లక్షల 64 వేల 544 రూపాయల వ్యయం చేయాలని లెక్కలు తేల్చారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 553 పనులకు గాను 25 కోట్ల 71 లక్షల, 91 వేల 300 రూపాయలు; గ్రామీణ ప్రాంతాల్లో 10,748 పనులకు గాను 337 కోట్ల 78 లక్షల 73 వేల 244 రూపాయలు అవసరం అవుతాయని అంచనా వేసారు. గ్రామ పంచాయితీ నిధుల నుంచి 5.73 కోట్ల రూపాయలతో 774 పనులు, మండల పరిషత్ నిధుల నుంచి 1.05 కోట్లతో 308 పనులు, జిల్లా పరిషత్ నిధుల నుంచి 115.17 కోట్ల రూపాయలతో 4,839 పనులు చేపట్టాలని తీర్మానించారు. అధికారులు వెల్లడించిన లెక్కల్లో రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల వివరాలు ఎందువల్లో వివరంగా తెలియ జేయలేదు. వాటి సంగతి దాచి పెట్టేసినట్లున్నారు. మామూలుగా గ్రామ పంచాయితీలు, మండల, జిల్లా పరిషత్‌లు సర్వసభ్య సమావేశాల్లో తీసుకొన్న నిర్ణయాల తాలూకు పనులు చేపట్టను ఆ సంస్థలలోని నిధులు వ్యయ పరుస్తారు. ఇక నుండి వారంతా ఆ పని మానేసి ప్రజల వద్దకు పరిపాలనలోని అర్జీల్లో పనులు చేసుకొంటూ కాలం గడపాలా? ఈ నిర్ణయాలను ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అమలు పరుస్తారా? చేపట్ట వలసిన పనుల తాలుకు బడ్జెట్ 403 కోట్లు వుంది. అప్పగించిన శాఖల తాలుకు పద్దులు మొత్తం 121.95; మిగతా నిధులు ఎక్కడి నుండి తెస్తారనేది చంద్రబాబు గారు చెప్పాలి. జీతాలకే డబ్బులు లేక ఖజానాలో అడుగు బొడుగు తవిడి హెలికాప్టర్ పెట్రోలు పోయించుకొని తిరుగుతుంటే, ఒక్కొక్క జిల్లాకు మూడేసి వందల కోట్లు ఇచ్చి, పనులు చేయించడం ఆయన కలిపయ్యే పనేనా? ఏ మాత్రం వెనుకా ముందు ఆలోచించకుండా ప్రచారం కోసం రాజకీయ వాదులు చేసే ఇటువంటి స్టంటులు ప్రజలను ఫూల్స్‌ను చేయడానికి తప్ప ఇంకెందుకూ పనికి రావు!

ఆశాదీప్ పాలసీ పునః ప్రారంభించారు

ఆశాదీప్ పాలసీని లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ పునః ప్రారంభించింది. 93 సెప్టెంబరులో ప్రారంభించి నవంబర్‌లో ముగించిన ఈ పాలసీకి ప్రజల నుంచి విపరీతమైన స్పందన లభించింది.

నెల్లూరు ఓటర్లు ఫోటోలు బాగానే తీయించుకున్నారు!

జిల్లాలో ఓటర్లకు గుర్తింపు కార్డులు కోసం వీడియో ఫోటోలు తీసే కార్యక్రమానికి మంచి స్పందనే లభించిందని. జిల్లా వ్యాప్తంగా 77 శాతం మేరకు ఫోటోలు తీసే పని పూర్తయ్యింది. ఇప్పటి వరకు ఫోటోలు 13,39,392 ఓటర్లు ఫోటోలు తీయించు కున్నారు. ఇందులో11 లక్షల కార్డులు ముద్రణ పూర్తయ్యి రెడీగా వున్నాయి. పాత జాబితా ప్రకారం 17,40,252 ఓటర్లు వుండగా ఫోటోలు తీయించు కోకుండా మిగిలి పోయిన 4 లక్షల 860 మందికి మూడో విడత ఫోటోలు తీయగలమని కలెక్టర్ ప్రకటించారు. ఇప్పటికే ఎమ్మార్వో కార్యాలయాల్లో ప్రకటించిన లిస్టులలో తప్పులను ఓటర్లు పరిశీలించి సరిదిద్దు కోవచ్చుంటున్నారు. ఇప్పుడు తేలిన మొత్తం ఓటర్ల సంఖ్యలో ఫారం నెం. 6 లో క్లెయిమ్ చేసిన వారిని కలపలేదని, దీని వల్ల జిల్లాలో ఓటర్ల సంఖ్య మరింత పెరగ వచ్చని కలెక్టర్ వివరిస్తూ డిశంబర్ 15 తేదిలోగా కార్డులకు సంబంధించిన అన్ని పనులూ పూర్తి చేస్తామన్నారు. 27 తేదికి రెండవ రౌండ వీడియో ఫోటోగ్రఫి ముగియగా, ఫోటోలు తీసుకొన్న వారి శాతం నియోజక వర్గాల వారిగా ఈ విధంగా వుంది ఉదయగిరి 73, కావలి 76, ఆల్లూరు 75, కోవూరు 80, ఆత్మకూరు 79, రాపూరు 81, నెల్లూరు 72, సర్వేపల్లి 85, గూడూరు 75, సూళ్లూరు పేట 74, వెంకటగిరిలో 79; 28తేది తన ఛాంబర్‌లో ఈ విషయం విలేకరుల సమావేశంలో కలెక్టర్ వివరించారు.

నెల్లూరులో వనమహోత్సవం

ప్రతి విద్యార్థి చెట్లు నాటే కార్యక్రమంలో పాలు పంచుకోవాలని జడ్పీ ఛైర్ పర్సన్ డాక్టర్ నాగభూషణమ్మ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. 27 తేది 46వ

నెల్లూరు సంగతులు

వనమహోత్సవాన్ని పురస్క రించుకొని పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారామె. జిల్లాలో జడ్పీ ఆధ్వర్యంలో నడిచే 250 పాఠశాలల్లో పాఠశాలకు 10 చెట్లు చొప్పున అటవీ శాఖాధికారులు సరఫరా చేయాలని కోరారు. చెట్లను పెంచేందుకు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలు స్కూళ్ల యాజమాన్యమే చూడాలని సలహా యిచ్చారామె. సభకు అధ్యక్షత వహించిన విజయవాడ అటవీ సంరక్షణాధికారి కె.డి.ఆర్. జయకుమార్ మాట్లాడుతూ కలుషిత వాతావరణం వల్ల అంటు వ్యాధులు సోకకుండా మానవుడు ఆరోగ్యంగా వుండాలంటే చెట్లు ఎంతో అవసరమని; చెట్లని పెంచడం ఒక సేవని చెప్పారు. ఒక చెట్టు 50 సంవత్సరాలు జీవించి నట్లైతే ఆ చెట్టు మానవునికి చేసే సేవల విలువ 16 లక్షల రూపాయల వరకు వుంటుం దన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు అటవీ సంరక్షణాధికారి సీతారామ్, హైస్కూల్ ప్రధానో పాధ్యాయుడు జనార్ధన రెడ్డి, మండల అటవీ శాఖాధికారి టి.వి. రమణ బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రమేష్‌రెడ్డి పర్యటన

గడిచిన 20 రోజు గా తల్లిదండ్రుల వియోగం వల్ల ఇంటి పట్టునే వుండిన రాష్ట్ర మార్కెటింగ్ గిడ్డంగుల శాఖా మంత్రి, 26 తేది టౌన్‌లో కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. డైకస్ రోడ్డు సమీపంలోని పంట కాలువను నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుతో కలిసి తనిఖీ చేశారు. ఈ పంట కాల్వ ద్వారా ప్రతి యేడూ వర్షా కాలంలో తమ ఇళ్లలో నీళ్లు ప్రవేశి స్తున్నాయని గంజిఖాన వాసులు మంత్రికి విన్నవించారు. పంట కాలువ గోడల ఎత్తును పెంచి శ్లాబ్ వేయించి,

కొరవ 8 పేజీలో



ఇటీవల నెల్లూరుకు వచ్చి, మంత్రి రమేష్ రెడ్డిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు.

సణుగుడు

* వివేకానందరెడ్డికి ప్రమోషన్
* వేనాటి సోదరుల తొందరపాటు!

ఆనం వివేకానంద రెడ్డికి ఒకేసారి పెద్ద రాజకీయ ప్రమోషన్ లభించింది. 1975లో, సంజయ్ గాంధీ ప్రభంజనంలో ఉదయ భానుడిగా తెరపైకి వచ్చిన వివేకా నందరెడ్డికి, 'ప్రకాశం' సంతరించు కోవడానికి ఇరవయ్యేళ్లు పట్టింది. అవకాశం కోసం ఇంత సుదీర్ఘ కాలం ఎదురు చూడడం చాలా కష్టమే. కానీ వివేకా ఓపికగానే వ్యవహరించాడు. మధ్యలో ఎన్నో అవకాశాలు చేతికి వచ్చి, నోటికి చేరేలోగా జారిపోయాయి. కారణం లేకుండా ఎన్నో రాజకీయ యుద్ధాలలో తలదూర్చి, క్షతగాత్రుడు కావలసి వచ్చింది. ఆశ, నిరాశల మధ్య వూగిస లాడవలసి వచ్చింది. అందని ద్రాక్ష పండ్ల పులుపు చవి చూడ వలసి వచ్చింది. ఇంకొకరు, ఇంకొకరు అయివుంటే ఎత్తు పల్లాల ప్రయాణంలో ఎప్పుడో అలసి పోయి, శక్తి క్షీణించి, మార్గ మధ్యంలోనే చతికిల పడిపోయి వుండేవారు. తెర మరుగై పోయి వుండేవారు. కాని వివేక పంటి బిగువున నడిచి నడిచి మరథాన్ రేసులో లక్ష్యం చేరుకున్నాడు.

డోలేంద్ర

వివేకాకు రాజకీయంగా వచ్చిన తొలి మునిసిపల్ వైస్ ఛైర్మన్ పదవి; ప్రతిష్ట పెంచిన ఈ పదవి రెండూ జనార్ధన రెడ్డి ప్రమేయంతో జరగడం విశేషం. రాజకీయంగా మధ్య మధ్యలో వైరుధ్యాలు ఏర్పడినా రెండు సార్లూ జనార్ధన రెడ్డి గారు వివేకాకు మాట సహాయం చేశారు. అప్పుడు కాని, ఇప్పుడు కాని రాజకీయ లెక్క పక్కల

కొరవ 7 పేజీలో

రసజ్ఞులకు ప్రీతి కల్పించే ఏకపాత్రల "రసరంగం"

[రసరంగం, రచయిత: వైద్యుల శ్రీనివాస రావు, ప్రతులకు: కె.ఎస్. ప్రచురణలు, 4/959సి, మొదటి వీధి, రామ్‌నగర్, నెల్లూరు - 524 002. వెల రూ. 1/-]

శ్రీ వైద్యుల శ్రీనివాస రావు స్వయంగా నటుడు, రచయిత కూడాను. నటుడు రచయిత అయినప్పుడు ఆ రచనలోని పాత్రలను తాను నటిస్తున్నట్టుగా భావిస్తూ రచన సాగిస్తాడు. అందువల్ల ఆ రచన చక్కగా, సహజంగా కుదిరి ప్రదర్శన యోగ్యతను సంపాదించు కుంటుంది. అందులోని పాత్రలు ఔచిత్యాన్ని సంత రించు కుంటాయి. పాత్రోచితంగా బలంగా సంభాషణలు అమరుతాయి.

ఈ విలువలతో కూడిన సాహిత్య భావుకత, శక్తి వంతమైన శైలి, పాత్రలను సహజంగా మలిచే యుక్తి శ్రీ వైద్యుల శ్రీనివాస రావులో పరిపూర్ణంగా వున్నాయి. సంపూర్ణమైన తన సాహిత్య సంపత్తితో నటనా వైదుష్యంతో నాటక కళా వికాసానికి శ్రద్ధా సక్తులతో ఆయన అత్యున్నత సేవ లందించాడు. ఆయన కలంలోని పలుకులను పలు నాటక రంగాలు ప్రముఖంగా పలికించాయి. ఆయన తన తృతీయ కుసుమంగా "రసరంగం" గ్రంథాన్ని రచించాడు. ఇందులో "దుష్యంతుడు, హిరణ్యా కశ్యపుడు, భద్రుడు, హరిశ్చంద్రుడు, సుయోధనుడు, సొబలే యుడు" అనే పేరు ఏక పాత్రాభి నయాలున్నాయి. వస్తు సేకరణలోనే ఆయన వైవిధ్యాన్ని ఆవిష్కరించాడు. మంచి శైలితో నిండిన భావను, విశిష్టతతో కూడిన శిల్పాన్ని ఆ పాత్రల్లో నిక్షిప్తం చేశాడు. ఆయన రంగ స్థల శిల్పం బాగా తెలిసిన వాడు. కాబట్టి, సాహిత్య విలువలు కలిగిన వాడు కాబట్టి ఏక పాత్రల రచనలో సత్ఫలితాన్ని సాధించాడు. ఆయన కళాభిజ్ఞతకు, సాహిత్య ప్రతిభకు రసరంగాన్ని ఒక ప్రతీకగా నిలుపు కున్నాడు.

"రసరంగం" లోని ఆరు పాత్రల్లో ప్రదర్శనాను కూల్యత స్పష్టిగా వుంది. ఉదాత్తమైన ఈ పాత్రలు సాహిత్యపు పట్టుతో మాటలను గంభీరంగా ప్రతి ధ్వనింప జేశాయి.

కొరవ 8 పేజీలో

ఎల్లసిరికి ఏసి కారు

గూడూరు డివిజన్‌లో ఎన్నికైన ప్రజా ప్రతినిధుల తీరే వేరుగా వుంటుంది. ప్రజల అవసరాల కంటె వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తల అవసరాలు తీర్చడంలో వారు నిత్యం బిజీగా కాలం గడుపుతుంటారు. రాపూరు ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి గూడూరులోని నిమ్మ వ్యాపారస్తుల సంక్షేమ చర్యలలో మునిగి తేలుతున్నారు. ఆయన మాజీ నిమ్మకాయల వ్యాపారి. అందువల్ల వారి సాధక బాధకాలు బాగా తెలుసు. వారితో సాన్నిహిత్యం కూడా ఎక్కువ. ఆ చనువుతో ఆ వ్యాపారులు ఎమ్మెల్యేని పూర్తిగా తమ స్వంతం చేసుకున్నట్లున్నారు.

గూడూరు నిమ్మకాయల మార్కెట్‌లోని పెద్ద వ్యాపారస్తులు అశోకా లైలాండ్ లారీలను ప్రయారిటీ కోటాలో బుక్ చేయించమని ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డిని కోరారట. ఆ పని చేసి పెట్టేందుకు ముందుగానే అడ్వాన్స్‌గా ఒక ఏసి కారును ఎమ్మెల్యేకు బహూకరించారట. ఎమ్మెల్యే గారు సిద్దార్థ హోటల్‌కు ముఖ్యమంత్రి కార్యాలయానికి మధ్య ఏసి కారులో చల్లగా షికారు చేస్తూ చివరికి వారి పని సాధించి పెట్టారట. ముఖ్యమంత్రి చేత అశోకా లైలాండ్ కంపెనీ వారి పై వత్తిడి తెచ్చి 40 లారీలు [illegible] చేయించడంలో కృతకృత్యులైనారట. ఎమ్మెల్యేలు ప్రజా ధనం నష్టం కాకుండా, తమ పలుకుబడితో వ్యాపార వర్గాలకు పనులు చేసి పెట్టడం తప్పు కాదు; అయితే అందుకు ప్రతిగా బహిరంగంగా నజరానాలు స్వీకరించారన్న ప్రచారం జరగడమే ప్రజా ప్రతినిధులకు పరువు తక్కువ విషయం. అవినీతికి ఎవరూ అతీతులు కారు; కాని మెడలో ఎముకలు వేసుకొని తిరగడమే అతిగా వుంటుంది. చూసేవారికి!

నిమ్మకాయల వ్యాపారుల నజరానా!

పోలీసులే సారాయి స్మగ్లర్లు!

మద్య నిషేధాన్ని కట్టు దిట్టంగా అమలు పరచను సూళ్లూరు పేట, గూడూరుల్లోని ఎక్సైజ్ శాఖాధికారులు కృషి చేస్తున్నప్పటికీ ఏదో ఒక దారిలో మద్యం ప్రవహిస్తూనే వుంది. ఈ మధ్య మద్యాన్ని దొంగ రవణా చేస్తూ సూళ్లూరు పేట, నెల్లూరులలో పోలీసులే పట్టు బడ్డారు. మళ్లీ అటువంటి నేరం పైనే 25 తేది గూడూరు డిఎస్‌పి ప్రభాకర రావు స్వయంగా మరో ఇద్దరు ఆర్మడ్ రిజర్వు పోలీసు కానిస్టేబిళ్లను అరెస్టు చేశారు. తిరుపతి నుంచి వరంగల్ వెళుతున్న రైలు స్వల్ప సాంకేతిక లోపంతో గూడూరు స్టేషన్‌లో ఆగింది. రైలు ఇక రెండు గంటల పాటు కదలదన్న నిర్ణయానికి వచ్చిన పి. శ్రీనివాస రావు, సుధాకర్ అనే కానిస్టేబిళ్లు తమ వద్ద వున్న బ్రాందీ బాటిళ్లను టౌన్‌లో అమ్మను వెళ్లి డిఎస్‌పి కంటపడి ఆయన చేతికి చిక్కి పోయారు. రైలులో మిగిలి వున్న మరో 38 మంది కానిస్టేబిళ్ల వద్ద కూడా మద్యం బాటిళ్లు వున్న సమాచారం అందుకొని డిఎస్పీ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. ఈ విషయం తెలుసుకొన్న కానిస్టేబిళ్లు బాటిళ్లను మొత్తం రైలు పట్టాల పై వేసి పగల గొట్టారు. తిరుపతిలో మద్య నిషేధం అమలు వుండగానే ఇంత భారీ మొత్తంలో సరకు కానిస్టేబిళ్లకు ఏ విధంగా వచ్చిందో అర్థం కావడం లేదు. కంచే చేను మేసిన చందంగా పోలీసులే మద్యాన్ని రైళ్లలో తీసుకొని విచ్చల విడిగా ప్రవర్తించడం విమర్శలకు దారితీస్తున్నది. పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయమై తమ శాఖ పరువు పోక మునుపే తమను తాము సంస్కరించుకోవడం.

కంచే చేను మేస్తుంటే మద్య నిషేధానికి కాపుకాచేదెవరు?

కాశ్మీర్ ప్రజల ఆలోచనలే వేరు

గూడూరులో జరిగిన జిల్లా పౌర హక్కుల సంఘం ఐదవ మహాసభలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలగోపాల్ వచ్చారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో సంఘం కార్యకర్తలను వుద్దేశించి మాట్లాడారు. కాశ్మీర్ ప్రజలు భారత్ - పాకిస్తాన్‌ల మధ్య వారధిగా, మిత్రులుగా స్వతంత్ర జాతిగా మనుగడ సాగించాలని కోరుకొంటున్నారు. కాని మత ఛాందస వాదులు అసలు సమస్యకు మతం రంగు పులుము తున్నారు. కేంద్ర ప్రభుత్వం అక్కడి ప్రజల మనో భావాలను నిరంకుశంగా అణచి వేస్తూ సైనిక ప్రయోగాలు చేస్తున్నది. వాస్తవంగా కాశ్మీర్‌లో నెలకొన్నది జాతుల సమస్య తప్ప మత పరమైన పోరాటం కాదని ఆయన వ్లాపించారు. కాశ్మీర్‌లో పౌర హక్కులను పునరుద్ధరించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని బాల గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలోనే జిల్లా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షునిగా ఓ. అబ్బాయి రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి. వెంకయ్య, పి. సుబ్రహ్మణ్యం, అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ. సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఎం. సాంబశివ రావులను ఎన్నుకొన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ నూర్ బాషా, ప్రొఫెసర్ శేషయ్య కూడా సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య

వెంకటగిరి పోలీస్ బెటాలియన్ రి[illegible] అసిస్టెంట్‌గా పనిచేసే సి.హెచ్.వి. [illegible] 24 తేది రాత్రి [illegible] తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొన్నా[illegible] [illegible]వలే ఉద్యోగం నుండి [illegible] [illegible]యుడు, కుటుంబం గడి[illegible] [illegible]ంతరం లేక అప్పులు చే[illegible] [illegible] సకాలంలో తీర్చలేక వ్యధ చెంది ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని చనిపోయినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు చెప్పారు.

దివిపాళెంకు సర్వారాయుడు చౌదరి మంచినీటి వుపకారం!

గూడూరు మండలం దివిపాళెం పంచాయితీ పరిధిలోని అరవయ్యకాలని, చవట గిరిజన కాలని, నెల్‌క్యాస్ట్ కాలని, గాంధీ నగర్‌ల అభివృద్ధికి వినియోగించేందుకు పార్లమెంట్ సభ్యుడు శ్రీ సర్వారాయ చౌదరి తన కోటా నుండి నిధులు మంజూరు చేసారు. ఈ కాలనీ లన్నిటికీ మంచినీరు సరఫరా చేసేందుకు రక్షిత మంచి నీటి పథకాన్ని ఈ నిధులతో నిర్మిస్తారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి కోరిక మేరకు తన కోటా నుండి చౌదరి ఈ నిధులు ఇచ్చారు. వెంకటగిరి నియోజక వర్గానికి కూడా గతంలో లక్షలాది రూపాయల నిధులు ఇచ్చి వున్నారాయన.

జిల్లా వార్తలు

కిరోసిన్ కోటా

జిల్లాలో పౌర సరఫరా పంపిణీ పథకం క్రింద నవంబరు నెలలో పంపిణీకి 2280.7 కిలో లీటర్ల కిరసనాయిల్ కేటాయించినట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.గిరిధర్ తెలియ జేస్తున్నారు. నెల్లూరు, గూడూరు, కావలి టౌన్లలో 7 లీటర్లు, తాలూకాల్లో 5 లీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో కార్డుకు 3 లీటర్ల లెక్కన కిరోసిన్ పంపిణీ చేస్తారని వివరించారు.

రాపూరు గబ్బు వదిలించరా?

అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని వుంది అన్న సామెత అచ్చు గుద్దినట్లు రాపూరు పంచాయితీకి సరిపోతుంది. ఈ మేజర్ పంచాయితీకి ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా, సిబ్బంది జీతాలు తీసుకోవడం మినహా అభివృద్ధి పనుల విషయమై కాసింత కూడా శ్రద్ధ చూపించడం లేదు. అందువల్లే రాపూరులో ఏ సందు, గొంది చూసినా గబ్బు కొట్టుకొంటూ వుంటాయి. ప్రధాన వీధుల్లో కూడా డ్రైనేజి సౌకర్యం లేదు. దీనివల్ల నిరంతరం మురికి నీరు రోడ్ల పై ప్రవహిస్తూంది. దోమలు దినదిన ప్రవర్థమాన మవుతున్నాయి. వీధి లైట్లు వెలిగి చాలా కాలమైందని రాపూరు వాసుల గగ్గోలు. వీధుల్లో చెత్త కూడా క్రమంగా రోజూ తొలగించక, తీరిక వున్నప్పుడు పని చేస్తున్నారని విమర్శ. జిల్లా పంచాయితీ అధికారి రాపూరుకు క్యాంపు వేసుకొని వెళ్లి పరిస్థితి విచారించి చక్కదిద్దితే ప్రజలు సంతోషిస్తారు.

పంచాయితీలో పుష్కలంగా నిధులున్నా పనిచేసే వారు లేరు!

చేస్తా: మాగుంట ఒంగోలులో మళ్లీ పోటీ

వచ్చే లోకసభ ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు సీటుకు తిరిగి పోటీ చేస్తానని ప్రస్తుత సిట్టింగ్ ఎంపి మాగుంట సుబ్బరామ రెడ్డి చెప్పారు. కావలి టౌన్‌లో గ్లోబల్ ఆగ్రో ఫార్మ్ ఇండస్ట్రీస్ ప్రారంభించడానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారాయన. లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 40 సీట్లు ఖాయమని, కాంగ్రెస్‌కు పోటీగా ఎన్టీఆర్ తెలుగుదేశం మాత్రమే నిలుస్తుందన్నారు. చంద్రబాబు వర్గం మూడో స్థానంలో వుంటుందని జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నాడే తప్ప, అభివృద్ధి పనుల విషయం ఆలోచించడం లేదన్నారు. కావలి పట్టణ ప్రజలకు గత ఎన్నికల సమయంలో

కొరవ 8 పేజీలో

స్మృత్యంజలి

అమరజీవి

కూరపాటి రామచంద్రారెడ్డి గారు

సంస్మరణ **6.12.95** తేది

మిమ్మల్ని ఎన్నటికీ మరచిపోలేని

సోదరీమణులు

శ్రీమతి ఈదూరు కమలమ్మ

డాక్టర్ కె. రాజమ్మ, B.A., M.D., D.C.H.

రిటైర్డ్ సివిల్ సర్జన్ - నెల్లూరు. ఫోన్: 25737

మేనల్లుడు

డాక్టర్ ఐ.వి. రఘునాధరెడ్డి, M.D.S.

డెంటల్‌సర్జన్

నెల్లూరు నలుచెరగుల్లో విమర్శకుడు

ముగ్గురు మంత్రులు

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి నందమూరి హరికృష్ణ 29 తేది రాత్రి కడప నుంచి కారులో నెల్లూరు వచ్చారు. 30 తేది జిల్లా అభివృద్ధి మండలి, జిల్లా తెలుగు దేశం, తెలుగు యువత సమావేశాల్లో పాల్గొని రాత్రి హైదరాబాదుకు రైలెక్కారు.

* * *

మార్కెటింగ్ శాఖ మంత్రి రమేష్ రెడ్డి వరంగల్ జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో పాల్గొని 29 తేది నెల్లూరు వచ్చారు. 30 తేది మంత్రి హరికృష్ణతో పాటు ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ రైలెక్కే తేది ఇంకా నిర్ణయం కాలేదు.

* * *

సెకండరీ విద్యా శాఖ మంత్రి, బల్లి దుర్గా ప్రసాద్ 30 తేది ఉదయం చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో రాజధాని నుండి నెల్లూరు వచ్చారు. రవాణా శాఖ మంత్రి హరికృష్ణ వెన్నంటి తిరిగి ఆయనతో పాటు రాత్రి తిరిగి రైలెక్కారు.

మునిసిపల్ కమీషనర్

నెల్లూరు మునిసిపల్ కమీషనర్‌గా పి. ఆంజనేయులు 27 తేది పదవీ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు మునిసిపల్ రీజినల్ డైరక్టర్ కార్యాలయంలో అడ్మి[illegible]షన్ అప్పిలేట్ కమీషనర్‌గా పని చేస్తుంటే వారు [illegible] నెలలో రిటైర్ అయ్యే ఆంజనేయులు ప్రమోషన్ వదులుకొని నెల్లూరుకు ఎందుకొచ్చారో?

నెల్లూరు ఎమ్మార్వో

నెల్లూరు ఎమ్మార్వో కుర్చీలో కరువుకు పోయి ఉండిన జి. బాలకృష్ణను అక్కడ నుంచి ఖాళీ చేయించి భూసంస్కరణల ప్రత్యేక తహసీల్దార్‌గా వేసారు. కోవూరు ఎమ్మార్వో ఓ. శేషయ్యను నెల్లూరుకు బదలీ చేసారు. నెల్లూరు ఎమ్మార్వో దాబు దర్పం ప్రదర్శించే వీలుంటుంది. జిల్లాలో ఏ ఎమ్మార్వోకూ లేని సౌకర్యం కూడా వుంది; కానీ మంత్రుల కొలువులో వారు హారతి కర్పూరం వలె కరిగి పోతుంటారు పాపం.

కెవిఆర్ పెట్రోల్ బంక్‌లో దొంగతనం

జిల్లా పోలీసు కార్యాలయం ప్రక్కనే వున్న కెవిఆర్ పెట్రోల్ బంకులో 29 తేది రాత్రి దోపిడీ జరిగింది. అర్ధరాత్రి 2.30 ప్రాంతంలో పెట్రోల్ కావాలని బంకు తలుపులు తట్టి సిబ్బందిని లేవగొట్టారట. వారు తలుపు తీయగానే కత్తులు, గండ్ర గొడ్డలి చూపించి చంపుతామని బెదిరించి సిబ్బంది చేత డబ్బున్న టేబుల్ డ్రాయర్ తీయించి అందులోని 33 వేల రూపాయలు పట్టుకెళ్ళి పోయారు. ఈ దొంగలు [illegible]ట్రోల్ బంకు ప్రక్కనే వున్న కస్తూరి దేవి హైస్కూల్ గోడ దూకి పారిపోయారన్న సమాచారం అందుకొన్న ఎస్పీ వెంటనే స్వయంగా రంగంలో దిగారు. టౌన్‌లోని పోలీసు సిబ్బందినిపురమాయించి రాత్రంతా గాలించినా ఫలితం లేకుండా పోయింది. హైవే పై వాహనాల నిరంతర రద్దీ మధ్య టౌన్ నడిబొడ్డులో దోపిడీ జరగడం హాస్యమైతే పోలీసుకు ఈ సమాచారాన్ని 8 నిమిషాలలోనే అందించినా దొంగలను పట్టుకోలేక పోవడం వారి వైఫల్యాన్ని ఎత్తి చూపుతుంది.

చావు పుకార్లు సృష్టించిందెవరు?

ఎవరు చేశారో, ఎందుకు చేశారో తెలియదు కాని, మొన్న 27 తేది పలు రకాల చావు పుకార్లు సృష్టించి నెల్లూరు టౌన్‌లో అలజడి సృష్టించారు. అంతా ఒక పథకం ప్రకారం జరిగింది తప్పిదం కాదు పని! టౌన్‌లోని ముఖ్యులైన వారందరికీ ఫోన్లు చేసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు శ్రీ నేదురుమల్లి జనార్ధన రెడ్డి తిరుపతి నుంచి వాకాడు వస్తూ కారు ప్రమాదానికి గురై మరణించారని చెప్పారు. ఆ వార్త క్షణాలలో టౌన్ ఎల్లలు దాటి, జిల్లా అంతా వ్యాపించి హైదరాబాదుకు చేరుకున్నది. స్నేహితులందరూ జనార్ధన రెడ్డి గారికి ఫోన్ చేసి, ఆయన హైదరాబాదులోనే క్షేమంగా వున్న విషయం నిర్ధారించుకొని వూపిరి పీల్చుకున్నారు. పత్రికా కార్యాలయాల ఫోన్లు మార్మోగి పోయాయి.

కొద్ది సేపటికి శ్రీ గునుపాటి రామచంద్రా రెడ్డి ఇదే మాదిరి కారు ప్రమాదంలో మరణించాడన్న పుకారు

మిగత 7 పేజీలో

జిల్లా గురించి నాకేమీ తెలియదు

-హరికృష్ణ ఒప్పుకోలు

జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో తొలిసారిగా పాల్గొనను నెల్లూరు వచ్చిన రవాణా శాఖా మంత్రి శ్రీ నందమూరి హరికృష్ణ 29 తేది రాత్రి టౌన్‌లో కాలిడింది మొదలు; 30 తేది రాత్రి, తిరిగి హైదరాబాదుకు రైలెక్కే వరకు యమ బిజీగా గడిపారు. అధికారులు, అనధికారులు సమర్పించిన అభివృద్ధి పనుల నివేదికలు పరిశీలించడంతో పాటు పార్టీ కార్యకర్తల సమావేశాల్లో కూడా పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటలకు సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి స్వగ్రామం అల్లీపురం వెళ్ళి పైటన్నం ఆరగించి వచ్చారు. జిల్లా అభివృద్ధి మండలి సమావేశాన్ని ముచ్చటగా మూడు గంటలు నిర్వహించారు. జిల్లా సమస్యల పై తనకు సరైన అవగాహన లేదన్న విషయం స్వయంగా ఒప్పుకొన్నారు మంత్రి. వచ్చే సమావేశం నాటికి అన్ని విషయాలూ వివరంగా తెలుసుకొని హుషారుగా వస్తానన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులేమో వాగ్దానాలు కురిపిస్తున్నారు; ఖజానా ఖాళీ అయ్యిందన్న విమర్శ మాత్రం మరో వైపు విన వస్తూంది. మీరేమి చెప్తారని ఒక విలేఖరి అడగగానే మంత్రి ఉలికి పడ్డారు. కాసింత చిరాకుగా 'ఎవరన్నారలా' అంటూ తన తండ్రి ఎన్టీఆర్ స్టైల్‌లో ఎదురు ప్రశ్నించి, ఖజానాకు ఢోకా లేదని చెప్పారు.

సమావేశంలో తీసుకొన్న 8 విధాన పరమైన నిర్ణయాలను ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ. గిరిధర్ మంత్రి సమక్షంలో ప్రకటించారు. గత సమావేశంలో తీర్మానించిన సోమశిల ప్రాజెక్టుకు 25 కోట్ల నిధులు ప్రతి సంవత్సరం ఇవ్వాలన్న విషయాన్ని మళ్ళీ తీర్మానించినట్లు కలెక్టరు చెప్పారు. ఈ విషయమై విలేకరులు నిలదీయగా మార్కెటింగ్ మంత్రి రమేష్ రెడ్డి జోక్యం చేసుకొని సోమశిల ప్రాజెక్టు మొదలు పెట్టినప్పుడు నిర్మాణ వ్యయం 17 కోట్లని; అది నేడు 90 కోట్లకు చేరుకొందన్నారు. ఇప్పటికే 45 కోట్లు ఖర్చు పెట్టినట్లు చెబుతూ, ఈ సంవత్సరం కేటాయించిన 8 కోట్లతో పాటు అదనంగా మరో నాలుగు కోట్ల కోసం జిల్లా ఎమ్మెల్యేలు కలసి కట్టుగా ముఖ్య మంత్రిని కలవ నున్నట్లు వివరించారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సేవ్ ది క్రాప్ పథకం ద్వారా జిల్లాకు 5 కోట్లు మంజూరు చేయాలని, ఈ నిధులతో బోర్లు వేయించాలని సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రజల వర్షకు పాలనలో డెల్టా, నాన్ డెల్టా ప్రాంతాల్లో జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విరివిగా వినతి పత్రాలు వచ్చిన దృష్ట్యా వాటి కోసం 32 కోట్లు మంజూరు చేయమని సమావేశం మరో తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరింది. గత సంవత్సరం వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న చెరువుల మరమ్మత్తులకు 4.5 కోట్ల అంచనా, నెల్లూరు టౌన్‌లో ఇరిగేషన్ కాల్వల అభివృద్ధికి 96 లక్షల అంచనాలు ఇరిగేషన్ శాఖ సమర్పించింది. దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్న మండలాలకు గత సంవత్సరం కేటాయించిన 50 లక్షల నిధులు తిరిగి కేటాయించాలని, గూడూరు టౌన్‌లో మంచి నీటి సమస్య పరిష్కారానికి 36 లక్షలు మంజూరు చేయాలని కూడా అభివృద్ధి మండలి సమావేశంలో తీర్మానించారు. ప్రతి తీర్మానం ఆర్థిక పరమైనదే. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితులలో ఈ సమస్యల పరిష్కారాల పట్ల ప్రజలు ఆశలు పెంచు కోవడం మంచిది కాదేమో! అభివృద్ధి మండలి సమావేశానికి వెంకటగిరి, కోవూరు శాసన సభ్యులు గైర్హాజ రయ్యారు.



మునిసిపల్ ఛైర్మన్లకు ఛైర్మన్ అయిన ఆనం వివేకానందరెడ్డిని పూల బొకె ఇచ్చి ఆత్మీయంగా అభినందిస్తున్న తెనాలి ఛైర్మన్ ఎ. విజయలక్ష్మి

సణుగుడు

4 పేజీ తరువాయి

కంటే వ్యక్తిగత అభిమానాలే వీటికి ప్రేరణలైనాయి. ఆ రోజుల్లో జనార్దన రెడ్డి జిల్లాకే పరిమితమైన వట్టి రెవిన్యూ మంత్రి. అప్పట్లో ఆనం కుటుంబ ప్రాభవం ప్రమాదంలో పడివుండింది. తన చర్య ఆ రాజకీయ కుటుంబానికి ప్రాణం పోస్తుందనే సంశయం వున్నప్పటికీ జనార్దన రెడ్డి గారు స్నేహ ధర్మం పాటించారు; ఇప్పుడాయన రాష్ట్ర నాయకుడు. జిల్లా సరిహద్దులు దాటి వెళ్లి పోయాడు. వివేకాతో రాజకీయావసరం పెద్దగా లేదు. అయినా అభిమానంతో మాట సాయం చేశారు. వీరిద్దరి మధ్య భవిష్యత్‌లో నికరంగా అనుబంధం నిలవడానికి ఈ రెండు సంఘటనలూ వుపకరిస్తాయి.

లైటు, కారు లేదనే పెదవి విరుపు గిట్టని వారిలో వున్నప్పటికీ వివేకాకు రాష్ట్ర వ్యాపితంగా పరిచయాలు, చిన్న పాటివైనా ఒక గుర్తింపు లభిస్తాయి. ఎమ్మిగనూరు, మహబూబ్ నగర్ వంటి టౌన్‌లలో సన్మానాలు అప్పుడే జరిగి పోయాయట. ఛైర్మన్లకు ఛైర్మన్‌గా ఏ టౌన్‌కు వెళ్లినా ఆదరణ లభించడం కంటె రాజకీయ వాదికి కావలసిం దింకేమి వుంటుంది.

* * *

రాజకీయం, వ్యాపారం కలగలిపి వ్యవహరించడం వేనాటి సోదరులకు చేత కావడం లేదు. రాజకీయం కోసం వ్యాపార పరంగా రాజీ పడ వలసి రావడం వారికి సంకటంగా వున్నట్లుంది. ఇంత కాలం వ్యాపారా భివృద్ధికి రాజకీయాన్ని సాధనంగా వాడుకోవడం అలవాటైన వారు కావడంతో; కొత్త పరిస్థితి వారికి మ్రింగుడు పడడం లేదు. సూళ్లూరు పేట, పొదలకూరు రాజకీయాలకు, సారాయి సామ్రాజ్యాలకు దగ్గరి చుట్టరికం. సారాయి డబ్బుతో రాజకీయ వ్యవహారాలు నడిపి, రాజకీయ పలుకు బడితో సారాయి డబ్బు పెంచుకొని తమ తమ పరిధులలో సామ్రాజ్యాలు నెలకొల్పు కున్నారు. ఏ దశలోనైనా వారికి సారాయే ప్రథమం, రాజకీయం ద్వితీయం. అందువల్లే వేనాటి సోదరులు అక్కడ, రావుల అంకయ్య గౌడ్ ఇక్కడ అధికారం నీడలో ఏ గాలికా చాప ఎత్తుతూ సర్దుకొని పోతుంటారు. విచిత్ర మేమిటంటే ఎప్పుడు ఎవరు అధికారంలో వుండినా వీరి మాటకే పరిగణన ఎక్కువగా వుంటుం టుంది. డబ్బు మహిమ అది.

మద్య నిషేధంతో సారాయి సామ్రాజ్యాలు శిథిలమై పోయాయి. కాని రు చి మరిగిన జిహ్వకు చాపల్యం సహజం కదా? అంకయ్య గౌడ్‌కు భౌగోళికంగా సారా కాయడం అలివయ్యే అవకాశం లేదు కాబట్టి, కోరికలు అణచుకొని, భవిష్యత్ అధికారం కోసం ఎన్టీఆర్‌ను అనుసరించి వెళ్తున్నాడు. కాని వేనాటి సోదరులది సరిహద్దు సామ్రాజ్యం. తడ వరకు మందు తడిలేని ఎడారి; తడ దాటితే మాత్రం మందు ప్రవాహం పరవళ్లు త్రొక్కే సెలయేటి గలగలలు. ఎల్లలు దాటితే అంతా చట్ట బద్ధం.

కాని తడ చెక్ పోస్టు - వారికి పెద్ద న్యూసెన్స్‌గా వున్నట్లుంది. అధికార పార్టీలో పెత్తనం చలాయించే స్థాయిలో వున్నప్పటికీ చెక్‌పోస్టు సిబ్బంది తరచు చికాకు సృష్టిస్తున్నారట. ఆరంభాసంలో వారి అంగళ్ల నుంచి త్రాగి వచ్చే వారిని అరెస్టు చేయడంతో పాటు ఈ మధ్య ఒక స్మగ్లింగ్ కారు వారి ఆఫీసు దగ్గర తలదాచుకొంటే ఎక్సైజ్ సిబ్బంది తరుము కొంటూ రావడం వారిలో అసహనం సృష్టించి నట్లున్నాయి. అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్లు, వేనాటి చంద్రా రెడ్డి గారు మొన్నొక రోజు ఈ వార్తలన్నిటినీ ప్రచురించిన ఆంధ్ర జ్యోతి విలేఖరిని పట్టుకొని తూర్పార బట్టారట. చంపే యండిరా, ఒకణ్ని నరికేస్తే తక్కిన వారికి బుద్ధి వస్తుంది అని అనుచరులను పురమా యించాడట. ఇదంతా పబ్లిక్‌గా జరిగింది. ప్రక్కనే ఎమ్మెల్యే పరసా రత్నం కూడా వున్నాడు. సారాయి సామ్రాజ్యంలో సామ్రాట్టుల పెత్తనాలట్లా వుండడం సహజమే కాని, జర్నలిస్ట్ పై నోటి దురుసు ప్రదర్శించడంతో కందిరీగల తుట్టె కదిపి నట్లయింది. పాత్రికేయ సంఘాలు కేకలు పెట్టాయి. అహం చంపుకొని, నెల్లూరు వచ్చి జర్నలిస్ట్ సంఘం ఎదుట అందరికీ క్షమాపణ చెప్పి తప్పుకు చెంప లేసు కోవలసి వచ్చింది. పాపం!

అసలు, మద్య పాన నిషేధం తమ వూపిరిగా చెప్పుకొంటున్న తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వుండి, మద్య పాన నిషేధ కార్యక్రమాలలో సంకోచం లేకుండా పాల్గొనే వేనాటి మునిరెడ్డి బ్రాందీ షాపులు నడపడమే పెద్ద తప్పు. ఏ మాత్రం నైతిక విలువల పట్ల పాటింపు వున్నా ఆయన వాటినో, తన పదవినో ఏదో ఒక దాన్ని వదలు కోవడం ధర్మం. అంత పెద్ద తప్పు చేస్తూ, మళ్లీ ఎక్సైజ్ అధికారుల పై బదలీ బెత్తం ఆడించడం, పత్రికా విలేఖరులను బెదరించి లొంగ దీయ చూడడం మరీ తొందర పాటు. రాజకీయాలలో వుండే వారు జనం కోసమైనా పెద్ద మనిషి తనం నటించడం అవసరం కదా? ఆలోచించండి!

నెల్లూరు ముచ్చట్లు

6 పేజీ తరువాయి

• గుప్పు మన్నది. జనం తికమక పడిపోయారు. మేనకూరు ఆదిశేష రెడ్డి ఇంటికి ఎవడో ఫోన్ చేసి, తాను గునుపాటి గుమాస్తానని, రెడ్డి గారు చనిపోయారని, శవం తీసుక వస్తున్నారని చెప్పారట. జనార్దన రెడ్డి చావు పుకారు వ్యాపింప జేసిన వాడు తనను నేదురుమల్లి పద్మనాభ రెడ్డి కుమారుడిగా ఫోన్‌లో చెప్పుకున్నాడు.

ఈ నీచుడెవడో కాని, ఒక రోజంతా టౌన్‌లో కల్లోలం సృష్టించాడు. దానివల్ల వాడికి ఒనగూడిన ప్రయోజనం ఏమిటో మరి!

బ్రతికి వుండగానే తమ చావు వార్త వింటే ఆయుష్షు పెరుగుతుందంటారు; జనార్దన రెడ్డి, గునుపాటి లిద్దరి విషయంలో అది నిజమౌతుందని ఆశిద్దాం!

టౌన్‌లో మహిళా దొంగల నాయకురాలు

నెల్లూరు టౌన్‌లో ఒక మహిళా దొంగల నాయకురాలు సంచరి స్తూందని అలజడిగా వుంది. నడి వయస్సులో వున్న ఈ మహిళకు ఒక చెయ్యి కాలినట్లు వుందట. సరస్వతి నగర్, రామమూర్తి నగర్ వంటి సంపన్ను లుండే ప్రాంతాలలో ఏదో ఒక సాకుతో ఇళ్లలోకి రావడం, గదులన్నీ పరిశీలించి వెళ్లడం, నచ్చిన ఇంటిని ఎంపిక చేయడం ఆమె డ్యూటీ అట. ఆ తర్వాత ఒకటి రెండు రోజులలోనే ఆ ఇళ్లలో దోపిడీలు జరుగు తున్నాయి. ఆమె రామమూర్తి నగర్ చివర, కాలువ ప్రక్క గుడిసెలలో తాత్కాలిక నివాసం ఏర్పర్చుకొని వున్నదని, ఆమె విషయం పోలీసులకు పూర్తిగా తెలుసునని చెప్తున్నారు. క్రైం సిఐ గారు కూడా ఆమె కథలు విచిత్రంగా చెప్పుకుం టున్నారని వినికిడి. ఆమె విషయం ఆరా తీసి పట్టుకొనే ధైర్యం మాత్రం ఆయనకు వున్నట్లు లేదు. సరస్వతి నగర్‌లోని ఒక ఇంట్లో ఆమె లోపలికి వచ్చినప్పుడు, ఇంట్లోని వారు పోలీసుకు రిపోర్టు చేస్తామని బెదరించారట. అయితే ఆమె చాలా నిర్లక్ష్యంగా ఫ్రిజ్‌లోని నీళ్లు తీసి త్రాగుతూ, పోలీసులు తననేమీ చేయలేరని సవాల్ చేసిందట.

ఎవరీ లేడి కేడి? పోలీసులతో ఆమెకేమి సంబంధం? పోలీసులు ఆమెను చూసి ఎందుకు భయపడ్తున్నారు? ఎస్‌పి గారు విచారించడం మంచిది!

చందన శారీ మందిర్

వస్త్ర వ్యాపారంలో అత్యద్భుత విజయాలు సాధించిన చందన శారీ మందిర్ వారు నెల్లూరులో తమ శాఖను ప్రారంభిస్తున్నారు. ఎ.సి.కెని సూపర్ మార్కెట్ మిద్దె పైన, రేపు (2 తేది) ప్రారంభం కాబోతుంది ఈ షోరూం!

చందన షోరూంకు చేస్తున్న అలంకరణలు చూస్తే ఆశ్చర్యంతో నోరు వెళ్ల బెట్టాల్సి నట్లుంది. అవేమి షోకులు, అవేమి లైట్లు? చీరల నుంచి షర్ట్ పీసుల వరకు కోట్ల విలువైన వస్త్రాలు కుప్ప బోసి వున్నారు. సరసమైన ధరలకు ఇస్తామనే హామీ కూడా వుంది. ఆడవాళ్లకు తనివి తీరా సెలక్షన్ చేసుకొనే అవకాశం.

చందన శారీ మందిర్ వ్యాపార విజయం సాధించాలని మా ఆకాంక్ష.

కరెంట్ శాపం

విద్యుత్ కోత ప్రత్యక్ష నరకం చవి చూపిస్తూంది. ఒక వేళా లేదు, పాళా లేదు. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. అధికారిక కోతకు అదనంగా కనీసం రెండు గంటలు చీకటి శాపం విధిస్తున్నారు. ఎప్పుడు జనానికి నరకం నుంచి విముక్తి?

జిప మీటింగులో నిధుల పై ఓటింగ్

జిల్లా పరిషత్ నిధుల నుంచి మండలానికి 50 వేల రూపాయల లెక్కన ప్రజల వద్దకు పాలన కార్యక్రమంలోని అర్జీల ప్రకారం పనులు చేయడానికి తీర్మానించారు.

29 తేది ఉదయం జరిగిన జిప స్థాయి సంఘ సమావేశంలో దీని పై పెద్ద రభస జరిగింది. ఎన్టీఆర్ తెలుగు దేశానికి చెందిన నాగభూషణమ్మ తన డబ్బు ససేమిరా చంద్రబాబు మెహర్బానీ కార్యక్రమం కోసం ఖర్చు పెట్టేది లేదని మొండి కేసింది. చంద్రబాబు తెలుగు దేశం ఎమ్మెల్యేలు ఆ పద్దుకు చెల్లించాలని పట్టు బట్టారు. వాదోప వాదాల తర్వాత విషయం ఓటింగ్‌కు పెట్టారు. నాగభూషణమ్మకు 10, వ్యతిరేకంగా 11 ఓట్లు పడ్డాయి. కాంగ్రెసీయులు నాగభూషణమ్మను సమర్థించారు.

జాతీయ నాణ్యత

2 పేజీ తరువాయి

ల్గింది. ఇది 34 శాతంతో సమానం. ఫలితాల ప్రకటనకు కొన్ని గంటల ముందుగా షేర్ ధర ఇంత పతన మైందంటే ఫలితాల గురించిన సమాచారం ముందుగానే బ్రోకర్లకు అందిందన్నమాట. షేర్ మార్కెట్‌లో ఇటువంటి ఇన్ఫర్మేషన్ లీక్‌లు పెద్ద సంచలనాలు సృష్టిస్తుంటాయి. ఇప్పుడు షేర్ ధర రు. 155 లకు వచ్చింది. ఇంకెంతకు పడిపోతుందో వూహించ లేకున్నాము.

నెల్లూరు సంగతులు

4 పేజీ కొరవ

జిల్లాలోకి నీళ్లు రాకుండా చూడాలని. అంతకు మునుపే ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు మంజూరు చేసి వున్న ఆ శాఖ అధికారులకు మంత్రి గుర్తుకు తెచ్చారు. అనంతరం జండా వీధిలోని పి.ఎస్.ఎల్. ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. శివాజీ నగర్ కాలనీలో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన వీధి దీపాలు ప్రారంభించారు. గత నాలుగు సంవత్సరాలుగా వున్న సమస్య మంత్రి చొరవతో తీరినందుకు కాలనీ వాసులు రమేష్ రెడ్డికి జేజేలు పలికారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఒక్క సంవత్సరం గడిచినా అనుకొన్నంత అభివృద్ధి చేయలేక పోయానని, మిగిలి వున్న 4 సంవత్సరాలలో ఇచ్చిన వాగ్దానాలన్నీ [illegible] రమేష్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్‌లో 157 టీచర్ పోస్టులు

[illegible] ఎస్సీ బ్యాక్‌లాగ్ లిస్టులో వున్న 157 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. దరఖాస్తు [illegible] ప్రతి అభ్యర్థి ఎంప్లాయి మెంట్ కార్యాలయంలో తమ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకొని వుండాలి. భర్తీ కోసం నిర్వహించే వ్రాత పరీక్షకు దరఖాస్తులు డిశంబర్ 1 తేదీ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయంలో [illegible] [illegible] 12 తేదీలోగా [illegible] విద్యాశాఖాధికారికి వ్యక్తిగతంగా దరఖాస్తులు సమర్పించమని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ. గిరిధర్ సలహా యిస్తున్నారు. వ్రాత పరీక్ష కోసం ఈ డిశంబరు 13 తేది నుంచి 27 తేది వరకు ప్రత్యేక శిక్షణ ఉచితంగా ఇస్తారట. భర్తీ చేసే పోస్టుల్లో స్పెషల్ గ్రేడ్ తెలుగు పండిట్ల కోసం వ్రాత పరీక్ష డిశంబరు 28, స్కూల్ అసిస్టెంట్లకు 29, భాషా పండితులకు 30 తేది పరీక్షలు జరుగుతాయి. జనవరి 26, 28 తేదిల్లో ఇంటర్వ్యూలు. ఫిబ్రవరి 15 తేదికి నియామకాలు జరుగుతాయని కలెక్టర్ చెబుతున్నారు. దరఖాస్తులు చేసే [illegible] తమకు వచ్చే సందేహాలను జిల్లా పరిషత్ కార్యాలయంలో [illegible] [illegible] కౌంటర్‌లో [illegible] పరీక్ష నిర్వహణకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేసి తాను స్వయంగా, పర్యవేక్షిస్తా నంటున్నారు కలెక్టర్.

చంద్రబాబు మాటలు వట్టి మాటల మూటలే!

హైదరాబాద్‌లో అనేక సంచలనాలకు కేంద్ర బిందువైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎ. నరేంద్ర 25, 26 తేదుల్లో జిల్లాలో వివిధ గ్రామాల్లో జండా ఆవిష్కరణ కార్యక్రమాలు బిజెపి కార్యకర్తల సమావేశాల్లో పాల్గొని వెళ్లారు. 25 తేది కాసింత తీరిక చేసుకొని విలేకరులతో మాట్లాడా రాయన. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోజు వారీగా ప్రజల పై కురిపిస్తున్న వరాల వర్షాలకు నిధులు ఎక్కడ నుండి తెస్తారో అర్థం కావటం లేదు. ఎమ్మెల్యేలకు నియోజక వర్గాల అభివృద్ధికి 150 కోట్లు, [illegible] [illegible] కిలో రెండు రూపాయల [illegible] [illegible] వల్ల ఖజానాకు సంప్రా ప్తించిన నష్టాలను పూడ్చుకొంటే ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడ నుండి వస్తుందో తెలియడం లేదు. సిఎం మాత్రం ప్రజల వద్దకు పాలన కార్యక్రమంలో లక్షలాది ఇళ్లు నిర్మిస్తాం, యువకులకు ఉపాధి, మహిళలకు వేయూత అంటూ అలివిగాని వాగ్దానాలు ఏ విధంగా చేస్తున్నారో ఆ పరమాత్ముడికే ఎరుకన్నా రాయన. కొద్ది నెలల్లో అరుగు, బొడుగులతో వున్న రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడు తుందన్నారు. అల్లలక గానే పండుగ కాదంటూ, ప్రజల వద్దకు పాలన పేరున నెల మొదటి వారంలో 25 లక్షల ఫిర్యాదులు అందితే వాటిలో ఎన్ని పరిష్కారానికి ఉత్తర్వు లిచ్చారో తెలియ జేయాలన్నారు. ఏదో ఒక విధంగా కాలం గడిపి, సాగినంత కాలం అధికారంలో ఉండాలనే తలంపుతో సిఎం వున్నారని; ఆయన ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవ దన్నారు. చంద్రబాబు నాయుడు వెనుక ఎమ్మెల్యేలు తప్ప జనం లేరని వివరించా రాయన. పార్లమెంటు ఎన్నికల తర్వాత తెలుగు దేశం పార్టీ మరోసారి చీలి పోతుందని నరేంద్ర జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ లేవలేని స్థితిలో వుంది. చీలిక వల్ల తెలుగు దేశం పార్టీ గబ్బు పట్టి పోయింది. అందువల్లే భారతీయ జనతా పార్టీ భవిష్యత్తు ఆశాజనకంగా వుంటుందని విస్పారిత ముఖంతో చెప్పారాయన. విలేకరుల సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు సురేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి కూడా పాల్గొన్నారు.

లక్ష్మీపార్వతి రాజకీయాల్లోకి వస్తేనే పార్టీకి భవిష్యత్తు!

జిల్లాలో ఎన్టీ రామారావు గ్రూపులో మిగిలి వున్న నాయకులు, నాయకురాళ్లను లక్ష్మీపార్వతి గ్రూపుగా లెక్క గట్టడం సమంజసం. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార రెడ్డి, కొండా చెంచులక్ష్మి, వైటి నాయుడు, కొండప నాయుడు, రంగ రాజన్ వీరంతా ఎన్టీఆర్ కన్నా లక్ష్మీపార్వతికే గట్టి మద్దతు దారులు. వీరందరూ 24 తేది జిల్లాలో తమ వర్గం తొలి కార్యవర్గ సమావేశం జరిపారు. సమావేశ తీర్మాన సారాంశ మేమిటంటే లక్ష్మీపార్వతి ప్రత్యక్ష రాజకీయ రంగ ప్రవేశం చేసి పార్టీని ఉద్ధరించాలనేది; లేకుంటే పార్టీకి భవిష్యత్తే లేదట. తరువాత యథా ప్రకారంగా చంద్రబాబు నాయుడు పై విమర్శల వర్షం కురిపిస్తూ తీర్మానాలు చేసారు. ఎరువుల ధరలు పెంచడం వల్ల రైతులు అల్లాడి పోతున్నారని, గద్దె నెక్కిన తొలి రోజుల్లో విద్యుత్ కోత క్షణంలో తీరుస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి మళ్లీ కోత ప్రకటించడం సిగ్గు చేటన్నారు. జిల్లా కలెక్టర్‌ను కూడా వెంటనే నియమించాలనేది ఈ వర్గం మరో డిమాండ్. సమావేశానికి ఆ వర్గం జిల్లా అధ్యక్షుడు ప్రసన్న కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. [illegible] నాగభూషణమ్మ, [illegible] చైర్మన్ సునీల్ కుమార్, కొండా చెంచులక్ష్మి రావుల అంకయ్య గౌడ్ [illegible] కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మాట తప్పారు

టౌన్‌లోని చిన్నా, పెద్దా ముస్లిం నాయకులంతా 27 తేది బారకాసులోని అంజుమన్ భవన్‌లో సమావేశమై పత్రికల వారి ముందు ప్రధాని పివి నరసింహా రావు పై నిప్పులు గ్రక్కారు. 92 లో మతోన్మాదుల చేతిలో అయోధ్యలో బాబ్రీ మసీదును విధ్వంసం చేసిన రోటనే తిరిగి దానిని కట్టిస్తానని ప్రధాని పివి నరసింహా రావు చేసిన వాగ్దానం మరచి పోయారని; అందువల్లే మతోన్మాదుల దృష్టి మధుర [illegible] ప్రార్థనా స్థలాల పైన [illegible] [illegible] [illegible] 6 తేది నెల్లూరు [illegible]

మింటిసంటిన కవికోకిల కవితాఝురి

దుగ్గొట్టి వేంకట రమణయ్య

ఉ. అంత మనంతమై యెసగ
నంత వసంత లితాంక వాసనా
ద్యంతము ఘ్రాణతర్పణము
లైనటు - నీదు కవిత్వ మాలల
త్యంత ప్రహృష్ట సుందరము
హాలికవర్య! త్వదీయ కావ్యముల్
మంతున కెక్కె నాంధ్రభువి
మంజుల శబ్ద రసప్రపూరమై

చం. బిడిగ[illegible] వీడి పైకొనిన
బింబఫలాధర కామ వాంఛ ప్రే
ముడుల ప్రసంగ సంగతిని
ముగ్ధ మనోహర కావ్య గీతిగా
'కడపటి వీడుకోలు'న ప్ర
కాశ మొనర్చితి వీవు సత్కవీ!
పుడమిని ప్రేమ కాంక్షలు ప్ర
మోద పదంబులు ధర్మబద్ధమై

చం. సిరిగల యాడు బిడ్డలు వి
చిత్ర విభూషణ రాజి నొప్పు - నీ
వరమర తోడ నీ మగని
నారయ బోకు కృషీవలీ! తగన్
దరుణికి భర్తృప్రేమ యె స
దా మహితోజ్జ్వల భూషణం బటం
చరుదగు సూక్తి చెప్పితివి-
అరయ లేమికి తృప్తి గూర్చుచున్

పారసీక గులాబీల పరిమళమ్ము
తెలుగు నేలను పండించితీవుసుకవి
ఫలితకేశమ్ముపరికించిపరువమెడలి
నన్న వేదాంత ధోరణి యవతరించె

చం. తెలుగు పద ప్రయోగముల
తీయన పారసి కన్న మిన్నయై
యొలసెను 'పానశాల' కవి
తొల్లస పుష్ప మధూళి ధామమై
జలజల మంజుల ధ్వనుల
జాల్కొను శైల ప్రవంతి రీతులన్
మెలపుగ నీ కవిత్వ ఝరి
మింటిని మంటిని నంటె గ్రావ్యమై

[illegible] ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసి [illegible] ఆధ్వర్యంలో బ్లాక్‌డేగా [illegible] ఆ రోజు టౌన్‌లో కోటమిట్టలోని షాదీ మంజిల్ వద్ద నుండి కలెక్టరేట్ వరకు మౌన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని వైఖరి వల్ల ముస్లిముల ధోరణి మారిందా; ఆ పార్టీకి ఓటు చేయరా అని ఒక విలేకరి ప్రశ్నించగా ఆ విషయంలో ఎవరి దారి వారిదేనని నాయకులు తప్పించు కొన్నారు. సమావేశంలో ఖాజీకోర్టు డిప్యూటీ ఖాజీ హాపుల్ హామీద్, జ్యూరీలు అమీర్ జాన్, ఖాసిం బాషా, ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ మొహియుద్దీన్, బార షహీద్ దర్గా మాజీ అధ్యక్షుడు ముతహర్ ముస్లిం పెద్దలు రహమత్ మొహియుద్దీన్, ఎం.ఎ. ఖాదర్ పాల్గొని తమ గళాలు వినిపించారు.

జిల్లావార్తలు

5 పేజీ కొరవ

ఈనిచ్చిన టివి రిలేస్టేషన్, టిటిడి కళ్యాణ మండపం వాగ్దానాలు నెరవేర్చినట్లు చెప్పుకొన్నారు. డబ్బు ఖర్చు పెట్టి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ప్రవీణ్ కుమార్ రెడ్డి నియామకాన్ని జరిపించినట్లు తన మీద వస్తున్న ఆరోపణలను సుబ్బరామ రెడ్డి ఖండించారు. నూరేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీకి పదవులు అమ్ముకొనే దౌర్భాగ్య స్థితి ఇంకా రాలేదన్నారు మాగుంట. ప్రెస్‌మీట్‌లో కావలి శాసన సభ్యుడు కలికి యానాదిరెడ్డి, మునిసిపల్ వైస్ ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి కూడా పాల్గొన్నారు.

నాయుడుపేటలో పారిశ్రామిక వాడ

గూడూరులో 25 తేది ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామిక సాంకేతిక సలహా సంప్రదింపుల సంస్థ నిరుద్యోగులకు శిక్షణా శిబిరం ఏర్పాటు చేసింది. ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజనా పథకం క్రింద స్వయం ఉపాధి కోరే నిరుద్యోగులకు 20 రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.వి. రావు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజనకు 1160 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి వుండగా ఇంత వరకు 600 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు ప్రారంభించే వారికి చాలా సులభంగా రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాటు చేశారని. ఏ పరిశ్రమైనా 30 హెచ్.పి. మోటారు కలిగి, 30 మంది పని వాళ్లు కలిగేదిగా వుంటే కేవలం డిపార్టుమెంట్‌కు సమాచారం తెలిపి ప్రారంభించ వచ్చున్నారు. మద్రాసుకు సంబంధించిన కొందరు పారిశ్రామిక వేత్తలు ఆంధ్రాలో పరిశ్రమలు పెట్టాలని నిర్ణయించు కొన్నందు వల్ల నాయుడుపేట వద్ద 300 ఎకరాలను సంస్థ తీసుకొని, పెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ పి. వెంకట్రామ రెడ్డి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు కె.ఎన్. శర్మ, గూడూరు ఎమ్మార్వో డివి రమణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముత్తుకూరులో గ్రంథాలయ వారోత్సవాలు

28వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముత్తుకూరు తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రంలో నవంబరు 14 నుంచి 18 తేది వరకు జరిగాయి. 14 తేది దేశ తొలి ప్రధాని నెహ్రూ జన్మదినం. 15, 16, 17 తేదుల్లో హైస్కూల్, కాలేజి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. 18 తేది ఉత్సవాల ముగింపు సభకు ముత్తుకూరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వాడా వేణుగోపాల్ రెడ్డి, ఉపన్యాసకులుగా లెక్చరర్ శ్రీమతి నిర్మల, ముఖ్య అతిథులుగా స్వాతంత్ర్య సమరయోధుడు ఈదూరు సుందర రామిరెడ్డి, మాజీ సర్పంచ్ కె. దయాసాగర్ రెడ్డి విచ్చేసారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మెట్టా చంద్రశేఖర రెడ్డి బహుమతి ప్రదానం గావించారు. చివరన లైబ్రేరియన్ వై. రాధాకృష్ణ మూర్తి వందన సమర్పణ చేసారు.

గ్రంథసమీక్ష

4 పేజీ కొరవ

రసజ్ఞులకు, నటనా వైదుష్యం వున్న కళాకారులకు, రసరంగం లోని ఏక పాత్రలు ప్రీతి పాత్ర మవుతాయి. విజ్ఞులు, రసజ్ఞులు, నటనా వైదుష్యుల మెప్పును పొంద గల "రసరంగం" రచించిన శ్రీ వైద్యుల శ్రీనివాస రావు అభినంద నీయుడు.

గిడుగు [illegible] గోపాలరావు

నెల్లూరు బజారు

మొలగొలుకులు	
9672	5,000/-
9674	6,000/-
సున్నాలు	3,500/-
బియ్యం బస్తా (70 కిలో)	700/-
బంగారు సవర (8గ్రా)	3,840/-
వెండి (10గ్రా)	75/-

నీటిమట్టం

కనిగిరి రిజర్వాయరు	17.0అ
సర్వేపల్లి రిజర్వాయరు	6.6 అ
నెల్లూరు చెరువు	12.0 అ

పంచాంగం

గురు మౌఢ్యమి

6.12.95 తేది బుధవారం ప్రారంభం

ముహూర్తములు

2.12.95 తేది శనివారం పగలు 11.16 గంటలకు వ్యాపారప్రారంభ, వివాహాలకు మకర లగ్నంలో సుముహూర్త మున్నది.

డిసెంబరు తిథులు

మార్గశిర శుద్ధ

తే 2 శని ఏకాదశి	రా.గ. 1.40 వ
తే 3 ఆది ద్వాదశి	రా.గ. 12.10 వ
తే 4 సోమ త్రయోదశి	రా.గ. 2.35 వ
తే 5 మంగళ చతుర్దశి	రా.గ. 3.29 వ
తే 6 బుధ పూర్ణిమ	రా.గ. 5.00 వ
తే 7 గురు పాడ్యమి పూర్తిగ	
తే 8 శుక్ర పాడ్యమి	ఉ.గ. 6.56 వ

స్వర్ణంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ

కడుపు నొప్పి చికిత్సకు...

రోజా స్విస్ ప్రయాణం

అప్పుడప్పుడు రోజాకు కడుపు నొప్పి వస్తూంటుందట. బాధతో మెలికలు తిరిగి పోతూంటుంది. ఎందరు స్పెషలిస్టులకు చూపించినా ప్రయోజనం లేకుండా ఉందట. అంచేత, ఏ స్విట్జర్లాండ్‌కు ట్రీట్‌మెంట్ కోసం వెళ్ళాలను కుంటోందట" ఆ తర్వాత హాలెండ్ వెళ్ళాలనుకుంది. స్విట్జర్లాండ్ ఎక్కడ చూసినా రంగు రంగు పువ్వులతో చాలా అందంగా ఉంటుందని విన్నాను. ఈ శతాబ్దం ముగిసే లోగా నా వివాహం జరిగితే, హాయిగా హాలెండ్‌లోనే సెటిల్ అవ్వాలని ఉంది" అంది రోజా.

"హలో...గురూ!"

ఈ చిత్రం షూటింగ్ కూడా కొంత భాగం ఇటీవల మద్రాసు వాహినీ స్టూడియోస్‌లో జరిగింది. శోభన్ బాబు, ఆమని, ఆలీ, నిరోషా, సత్య నారాయణ, ఎ.వి.ఎస్., బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి, పి.జె. శర్మ, ఐరన్ లెగ్ శాస్త్రి, దినేష్, అన్నపూర్ణ, వై.విజయ, డిస్కోశాంతి పాత్రధారులు. మాటలు: జంధ్యాల, గీతాలు: సిరివెన్నెల, సంగీతం: రాజ్, దర్శకత్వం: వై. వెంకట్రామ్. డిసెంబర్ నెలాఖరులో విడుదల చేయాలని నిర్మాత రాధికా రెడ్డి సంకల్పం.

జగదేకవీరుడు

మన రాష్ట్రంలో చలన చిత్ర కార్మికుల సమ్మె మూలంగా జగదేక వీరుడు చిత్రానికి కొన్ని ముఖ్యమైన సన్నివేశాలు ఇటీవల మద్రాసులో చిత్రీకరింప బడ్డాయి. కృష్ణ సరసన సౌందర్య, ఇంద్రజ ప్రేమనాయికలు. మాటలు: ఎల్.బి. శ్రీరాం, గీతాలు: వేటూరి, సంగీతం: కోటి, దర్శకత్వం: సాగర్.



తక్కువరపు సుబ్బరామరెడ్డి గారు నిర్మిస్తున్న ప్రతిష్ఠాకర చిత్రం 'స్వామి వివేకానంద' లో ఒక సన్నివేశం. వివేకానందగా సర్వదమన్ బెనర్జీ, జయప్రద.

శేషన్ ఇంటి పై శ్రీదేవి మోజు!

"ఊటీలో వెస్టన్ కేచ్‌మెంట్ - అనే ప్రదేశం ఒకటుంది. అక్కడ్నుంచి చూస్తే, మబ్బులన్నీ మన కింద ఉన్నట్లు కనిపిస్తాయి. మబ్బులతో మనం దోబూచు లాడుతున్నట్లుగా ఉంటుంది. అదే మాదిరి కోయంబత్తూరు దగ్గరున్న అట్టకట్టి ఊరు. ఎప్పుడు చూసినా వర్షం కురవ బోతున్నట్లు మేఘావృత్తంగా ఉంటుంది. వాతావరణం చల్లగా ఏడాది పొడవునా ఉంటుంది. సీనరీస్ ఎంత బాగుంటాయో! చాలా కాలం తర్వాత దక్షిణాదిలో షూటింగ్‌లలో పాల్గొంటుంటే ఎంత థ్రిల్లింగ్‌గా ఉందో" అంటూ శ్రీదేవి ఇంకా ఇలా చెప్పింది "పాల్ఘాట్‌లో దేవరాగం షూటింగ్. అరవింద స్వామి హీరో, నేను బ్రాహ్మణ పిల్లను. పాల్ఘాట్‌లో అతి పురాతన భవనం అది ఎలెక్షన్ కమీషనర్ టి.ఎన్. శేషన్‌దట. ఇప్పుడాయన తమ్ముడుంటున్నారు. ఆ భవనం కాంపౌండ్ గోడ మీద నుంచి నేను దూకాలి. ఆ గోడకు ఒక నల్లిచెట్టు ఆనుకొని వుంది. కింద కెమరాను

కొరవ 11 పేజీలో

నెలకు పదివేల ఒప్పందం

ఆమనికి తల్లితో తగువు

సంపాదన ఎక్కువైతే కొన్ని సినిమా కుటుంబాలలో కలతలు పుట్టుకొస్తాయి. ఆమనికి, ఆమె తల్లికి మధ్య తగాదా అని ఇది వరకు చెప్పుకునే వారు. ఇప్పుడది తారాస్థాయికి చేరుకుంది. కూతురు తన సొంత ఖర్చులకు ఏమీ ఇవ్వడం లేదని తల్లి ఫిర్యాదు. ఒక రోజు ఏదో షూటింగ్ సమయంలో కూడా పెద్ద రాద్ధాంతం జరిగింది. దాసరి నారాయణ రావు మధ్య వర్తిత్వం వహించ వలసి వచ్చింది. చివరికి ఆమని తన తల్లికి ప్రతి నెలా పది వేల రూపాయలు ఇవ్వడానికి అంగీక రించిందట.

జంధ్యాల దర్శకత్వంలో "పిల్లలున్నారు జాగ్రత్త"

జంధ్యాల దర్శకత్వంలో డి. రామానాయుడు నిర్మించిన "ఓహో నా పెళ్ళంట" చిత్రం జనవరి 26న విడుదలవగానే "పిల్లలున్నారు జాగ్రత్త" చిత్రాన్ని ఎం.వి.ఎస్. హరనాథ రావు కథ ఆధారంగా రూపొందిస్తారు.

మీనా ఇంట్లో చిన్న థియేటర్

మద్రాసు దశరథ పురంలో మీనా ఒక పెద్ద భవంతి నిర్మించి అందులోకి మారింది. ఆ బంగళాలో ఒక మినీ థియేటర్ కూడా నిర్మించింది. తాను చూడాలనుకున్న సినిమా ప్రింట్లు తెప్పించి, అక్కడే హాయిగా తన తల్లితో చూస్తూంటుంది.

మదీనా ఇస్మాయిల్ సినిమాలో సెక్సీ శీతల్!

శీతల్ కొత్త తార. ఒక తెలుగు చిత్రంలో కూడా నటిస్తూంది. "నాకు ఇంకా చదువు కోవాలని ఆశ. బాగా మార్కులు తెచ్చుకునే దాన్ని. ఇంతలో సినిమా ఛాన్స్ వచ్చింది. చదువా, లేక సినిమానా అని చాలా కాలం పాటు సతమత మయ్యేదాన్ని. చివరికి సినిమా వైపు మొగ్గక తప్పలేదు. అదే నా భవిష్యత్తు అనే నిర్ణయానికి రాక తప్పలేదు కూడా! ఆత్మ అనే తెలుగు చిత్రంలో నా పేరు మార్చినట్లున్నారు. ఈ చిత్రం షూటింగ్ కోసం విశాఖ పట్టణం వెళ్లాను. సెప్టెంబర్ 21 నుంచి ఒక నెల రోజుల పాటు అక్కడే మకాం చేశాను. అక్టోబర్ 28 నుంచి అనకాపల్లి, సింహాచలం, కైలాసగిరి తీర్థం, గాజువాక, ఎర్ర కొండలు ప్రదేశాలలో షూటింగ్ జరిగింది. అయిదు పాటల చిత్రీకరణతో టాకీ పార్ట్ పూర్తయ్యింది. షేక్ ఇస్మాయిల్ హీరో. ఆయన నెల్లూరులో మదీనా వాచ్ కంపెనీ అధినేత" అంది శీతల్. "ఆత్మ" చిత్రంలో కీర్తి, మాధురి, శాంతి, బ్రహ్మానందం, బాబూ మోహన్, నర్రా వెంకటేశ్వర రావు నటించారు. ఆ చిత్రంలో నేను సెకండ్ హీరోయిన్. కాస్త సెక్సీగాను కనిపిస్తా సుమండీ అంది శీతల్.

అచ్చొచ్చిన "అ"

దర్శకుడు ఇ.వి.వి. సత్యనారాయణ సెంటి మెంట్ వల్ల ఆయన ప్రతి చిత్రం టైటిల్ 'అ' తో ప్రారంభ మవుతుంది. "అల్లుడా! మజాకా, అబ్బాయి గారు, అప్పుల అప్పారావు, ఆయనకి ఇద్దరు, ఆమె, అలీబాబా అరడజను దొంగలు, ఆ ఒక్కటీ అడక్కు". మోహన్ బాబు నటించిన "అల్లుడుగారు, అసెంబ్లీ రౌడీ, అల్లరి మొగుడు" చిత్రాలకు కూడా 'అ' సెంటిమెంటే. అంచేత వీళ్ళద్దరి సమ్మేళనంలో తయారయ్యే చిత్రానికి "అదిరింది అల్లుడు" టైటిల్ పెట్టారు. రమ్యకృష్ణ, బొంబాయి తార సోనాలి బింద్రె నాయికలు.

అందరినీ అలరించే హాయైన హాస్య భరితం

టోపీరాజా, స్వీటీ రోజా

చిత్రసమీక్ష
గ్రిద్దలూరు గోపాలరావు

రాజేంద్ర ప్రసాద్ మంచి హాస్య నటుడు. ఆయన సంగీత మంటే చెవి కోసుకునేట్టుంది. సంగీతం చెవులారా విని ఆనందించటమే గాక తన నోటి ద్వారా తన సంగీతాభి రుచిని వెల్లడించు కునేందుకు గతంలో "తెనెటీగ" చిత్రంలో ఒక పాట పాడాడు. ఇప్పుడు "టోపి రాజా- స్వీటి రాజా" చిత్రానికి సంగీత దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో వున్న ఐదు పాటలకు ఆయనే బాణీలు రూపొందించాడు. కొన్ని పాటలు జానపద ధోరణిలో సాగుతాయి. పాటలన్నీ కమ్మగా వున్నాయి. "టోపీ టోపీ, భలే టోపీ" పాట బాణీ కుషీ కుషీగా సాగుతుంది. హాస్యంలోనే కాదు సంగీతంలోను మొనగాడని పించుకున్నాడు రాజేంద్ర ప్రసాద్.

ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్ (రాజా) అనే మంచి పాత్రను తన హాస్య ధోరణిలో జన రంజకంగా పోషించాడు. రాజా ఒక పల్లెటూళ్లో పుట్టి పెరిగిన వాడు. చదువు కున్నవాడు. అయినా పల్లెటూరు మీద అభిమానంతో ఆ ఊళ్ళోనే వుండి పోతాడు. కొంత వరకు అమాయకుడు. ఊరికే వుండలేక ఆ వూళ్ళో భూస్వామి రాయుడి ఇంట్లో పనికి చేరుతాడు. నమ్మిన బంటుగా పేరు తెచ్చుకుంటాడు. రాయుడి కూతురు రోజా (రోజా) రాజాను ప్రేమిస్తుంది. కాని రాజా, రోజాకు దూరంగా వుంటాడు. రోజా, రాజాను ప్రేమిస్తుందని తెలుసుకున్న రాయుడు, అంతస్థులు తేడా వున్నప్పటికీ, తమ అంతస్తును మించిన గుణ సంపద రాజాలో వుందని గమనించిన రోజాను రాజాకిచ్చి పెళ్ళి చేయాలను కుంటాడు. రోజా మేనమామ (బాబూ మోహన్) ఆమెను పెళ్ళి చేసుకోవాలను కుంటాడు. కాని రాజా అడ్డు తగులుతాడు. రాజాను అడ్డు తొలగించు కునేందుకు అతని మీద దొంగ తనం నేరం మోపుతాడు. రాజా తల్లి మంచి పడుతుంది. నువ్వు నిర్దోషివని రుజువు చేసుకొనేంత వరకు నీ ముఖం చూడనని రాజాను నిందిస్తుంది. రాజా బస్తీకి పోతాడు. అక్కడ గూండాల ఆఘాయిత్యానికి

కొరవ 11 పేజీలో

చక్కెర ఎక్కువైతే బ్రతుకంతా చేదు!

స్టాక్‌హోంలో జరిగిన అంతర్జాతీయ మధుమేహ వ్యాధి సదస్సులో పాల్గొనే అవకాశం నాకు లభించింది. భారత దేశం నుంచి ఈ సదస్సులో పాల్గొన్న డయబెటిక్ డాక్టర్లలో నేనొకర్ని. 170 దేశాల నుంచి ఐదు వేల మంది వరకు నిపుణులు హాజరైన ఈ సదస్సులో మధుమేహ వ్యాధి గురించిన పలు ఆసక్తికర అంశాలు చర్చకు వచ్చాయి.

డయబటిస్ వ్యాధి పై డాక్టర్ అనిల్ కుమార్ విదేశీ శిక్షణానుభవాలు

చక్కెర వ్యాధి నివారణ, చికిత్సల విషయంలో మనం ఎంత వెనుకబడి వున్నామో ఈ సదస్సులో బాగా అర్థమైంది. చక్కెర వ్యాధి మనకే పరిమితం కాదు; ప్రపంచ వ్యాప్తంగా వుంది. అయితే షుగర్ వ్యాధి వున్నప్పటికీ ఐరోపా దేశాల ప్రజలు చాలా ఆరోగ్యంగా వున్నారు. వారిని వ్యాధి పెద్దగా బాధించడం లేదు. చదువులు, ఆటలు, ఉద్యోగాలకు ఆటంకం కావడం లేదు. షుగర్ వ్యాధి పై పరిశోధనకు ఆ దేశాలలో పెద్ద పెద్ద ఆస్పత్రులు, పరిశోధ నాలయాలు వున్నాయి. వ్యాధి ప్రారంభ దశలోనే శరీరంలో జరిగే మార్పులు, ప్రభావాల పై వారు సునిశితమైన పరిశోధనలు చేస్తున్నారు. వ్యాధి ప్రభావాన్ని ముందుగానే పసిగట్టి, దాని వల్ల గుండె, మూత్రనాళాలు, కళ్లు దెబ్బ తినకుండా కాపాడు తున్నారు. షుగర్ వ్యాధి వున్నప్పటికీ వ్యక్తులు తమ దినచర్యలో ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా కులాసాగా వుండ గల్గుతున్నారు.

మనకు ఇంకా అటువంటి వసతులు ఏర్పడలేదు. చక్కెర వ్యాధి వల్ల రక్తంలో ఏర్పడే చెడు ఫలితాలను ఐరోపా దేశాలలో వలె ముందుగా పసిగట్టి, జాగ్రత్త పడేందుకు అవసరమైన ఆధునిక రక్త పరీక్షలు మన డాక్టర్లకు అందుబాటులో లేవు. మరొక ముఖ్య విషయం - ప్రపంచంలో ఎక్కడున్నప్పటికీ భారతీయులలో మధుమేహ వ్యాధి తీవ్రత అధికంగా వుందని జన్యు శాస్త్రవేత్తలు వెల్లడించడం. అమెరికా, ఐరోపా దేశాలలో వుండే భారతీయులలో మధుమేహ వ్యాధి అధికంగా వున్నట్లు వివిధ పరిశోధనలు నిరూపించాయి. పలువురు నిపుణులు, జన్యు శాస్త్రవేత్తలు ఈ విషయమై చర్చలు జరుపు తున్నారు. అమెరికా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా దేశాలలో నివసించే భారతీయులను, అక్కడి స్వదేశీయులను పోల్చి చూస్తే ఆ దేశాలలో నివశించే భారతీయులలో రెండు రెట్లు అధికంగా



షుగర్ వ్యాధి వున్నగ

మన దేశంలో అధిక శాతం చక్కెర వ్యాధి రోగులకు పాతికేళ్ల ప్రాయంలోనే ఇది సోకుతున్నది; విదేశాలలోని వారికి 45 ఏళ్లు వయస్సు వచ్చిన తర్వాత మాత్రమే ఈ వ్యాధి సోకుతున్నది.

విదేశాలలోని భారతీయులలోనే కాక, స్వదేశంలోని వారిలో కూడా చక్కెర వ్యాధి సమస్య ఏటికేడాదికి అధిక మౌతున్నది. అయితే దురదృష్టవశాత్తు మన దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రెండింటిలోనూ తమ వద్దకు వచ్చే చక్కెర వ్యాధి రోగుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, వారికి కల ఇతర జబ్బులు, వారి జీవితపు అలవాట్లు వంటి సమాచారంతో కూడిన రికార్డులు ఏవీ లేవు. అందువల్ల దేశ జనాభాలో ఎంత మందికి నిజంగా చక్కెర వ్యాధి సోకి వున్నదన్న సమాచారం లేదు.

మధుమేహ వ్యాధి పై ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగు తున్నాయి. ఎంతో మంది డాక్టర్లు, శాస్త్రవేత్తలు, జన్యు శాస్త్రజ్ఞులు, బయో కెమిస్టులు ఎన్నో అంశాల పై విశేష కృషి సల్పుతున్నారు. ఈ పరిశోధనల వల్ల రాబోయే కాలంలో ఎన్నో నూతన ప్రక్రియలు ప్రజలకు చేరువ కాబోతున్నాయి. ఈ నూతన ప్రక్రియల వల్ల ప్రజలు చక్కెర వ్యాధికి గురైనప్పటికీ దిన చర్యలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆరోగ్య వంతుల వలె జీవితం గడపడానికి వీలౌతుందని నిపుణులు ఆశిస్తున్నారు.

ఈలోగా ప్రజలు చక్కెర వ్యాధి గురించిన ప్రాథమిక అంశాల పట్ల, పూర్తి అవగాహన పొందగల్గితే, ఇప్పుడందు బాటులో వున్న సౌకర్యాలతోనే ఆరోగ్యంగా గడిపేందుకు ప్రయత్నించ వచ్చు.

రక్తంలో చక్కెర శాతం పెరగడాన్ని మధుమేహ వ్యాధి అని స్థూలంగా చెప్పవచ్చు. రక్తంలో చక్కెర పరిమాణం 150 మిల్లీ గ్రాములు లేదా 100 మిల్లీ లీటర్లకు మించకుండా చూసుకోవాలి. అంతకంటే పెరిగితే రక్తం చిక్కగా మారి, రక్తనాళాల రంధ్రాలను పూడ్చి వేస్తుంది. చిన్న వయస్సులో ఈ వ్యాధి సోకితే గుండె, మూత్ర పిండాలు, కళ్లు, నరాలకు సంబంధించిన సమస్యలు ఎదుర్కో వలసి వస్తుంది.

చక్కెర వ్యాధికి కారణాలు అనేకం. వంశపారం పర్యం, వైరస్ క్రిములు, లావు పెరగడం, మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లేక పోవడం, అధిక సంతానం, ఆధునిక జీవన సరళి వంటి ఏ కారణం చేతనైనా చక్కెర వ్యాధి వచ్చే అవకాశం వుంది.

మధుమేహం వున్న వారిలో బిపి, గుండె పోటు వ్యాధులు వచ్చేందుకు రెండు రెట్లు అధిక అవకాశం వుంటుంది. పండికి తగిలే గాయాలు మానవు. మన దేశంలో కనీసం 30 శాతం మంది చక్కెర వ్యాధి పీడితులు కాళ్లకు తగిలే గాయాలు మానక, అవిటి వారవు తున్నారు.

స్టాక్‌హోం సదస్సులో పలువురు శాస్త్రవేత్తలు చక్కెర వ్యాధి నివారణ, చికిత్సలకు పలు నూతన ప్రక్రియలు సూచించారు. ఇన్సులినెన్ మందును ఇంజక్షన్ ద్వారా కాక గాలి రూపంలో ఇన్‌హేలర్‌ల ద్వారా రోగికి అందించే ప్రక్రియ - ఇందులో ప్రధానమైనది. ఇన్‌హేలర్ ద్వారా లోపలకు వెళ్లి, ఇన్సులిన్ మందు నేరుగా వూపిరి తిత్తుల పై పనిచేసి, చక్కెర శాతాన్ని అదుపు చేస్తున్నది.

ఇన్సులిన్ సాధారణంగా శరీరంలో 12 గంటలు మాత్రమే పనిచేస్తుంది. మధుమేహ రోగులు వ్యాధి తీవ్రమైనప్పుడు రోజుకు రెండు సార్లు ఇంజక్షన్‌ల ద్వారా ఇన్సులిన్ తీసుకోవలసి రావడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఇంజక్షన్‌లు వేయించు కోవడంలో ఎదురయ్యే ఇబ్బందుల వల్ల చాలా మంది రోజుకు ఒక ఇంజక్షన్‌తో సరి పెట్టు కొంటుంటారు. దీనితో వారిలో చక్కెర శాతం ఎప్పుడూ అదుపు తప్పి వుంటుంది. దీనివల్ల దీర్ఘ కాలంలో చాలా సమస్యలు ఎదురౌతాయి. ఇందుకు పరిష్కారంగా డెన్మార్క్ శాస్త్రవేత్తలు శరీరంలో దాదాపు 20 గంటల పాటు పనిచేసే కొత్త రకం ఇన్సులిన్ కనిపెట్టారు. దీనికి వారు NN - 304 అని నామకరణం చేశారు. ఈ కొత్తరకం ఇన్సులిన్ రోగులకు ఎంతో సౌకర్యం. రోజూ ఒక ఇంజక్షన్ వేసుకొంటే సరిపోతుంది.

ఇంగ్లండరు శాస్త్రవేత్తలు గ్లిమి పెరైడ్, ట్రోగ్లిటజోన్ అనే రెండు కొత్త రకం మాత్రలు పరిచయం చేశారు. ఈ మాత్రలు చక్కెర శాతాన్ని బాగా తగ్గించడమే కాక, సాధారణంగా షుగర్ మాత్రల వల్ల ఎదురయ్యే దుష్ఫలితాలు లేకుండా రోగిని ఆరోగ్య వంతంగా వుంచుతాయని పరిశోధనలు రుజువు చేశాయి.

మధుమేహ వ్యాధి వంశ పారం పర్యంగా సంక్రమించే కుటుంబాలలో పిల్లలకు కనీసం తొలి ఐదు నెలల పాటు తల్లి పాలు పట్టిస్తే చక్కెర వ్యాధి నుంచి వారు తప్పించుకొనే అవకాశం వుందని పరిశోధనలో తెలినట్లు ఈ సమావేశంలో ప్రకటించారు. ఇటు వంటి కుటుంబాలలో తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు చక్కెర వ్యాధికి సులభంగా లోనౌతారట. అందువల్ల గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకొంటే ఎంతో మేలు జరుగు తుందని శాస్త్రవేత్తలు చెప్పారు.

దీర్ఘకాలంగా మద్యం సేవించే వారిలో చక్కెర వ్యాధిని అదుపులో పెట్టడం చాలా కష్టమని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ధూమపానం చేసే మధుమేహ రోగులలో కాలేయం, గుండె, రక్తనాళాలకు సంబంధించిన జబ్బులు తీవ్రంగా వుంటున్నాయని పరిశోధనలు నిరూపించాయి.

ప్రతి వ్యక్తి తన దిన చర్యలో కొంత భాగం శారీరక వ్యాయామానికి కేటాయిస్తే చాలా సమస్యలు అధిగమించ వచ్చునన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. వెన్న, నెయ్యి, మాంసం, వేరుశెనగ నూనె వంటి క్రొవ్వు పదార్థాలను అతి తక్కువ పరిమాణంలో తీసుకోవడం, తీపి పదార్థాల జోలికి పోకుండడం చాలా మంచిది.

పార్వతి కోరకి

మొదటి పేజీ కొరవ

ఎన్టీఆర్ శిబిరంలో ఇమడలేక దగ్గుబాటి యమ యాతన పడ్తున్నాడు. లక్ష్మీ పార్వతి రాజకీయ రంగ ప్రవేశంతో సహజంగానే ఆమె ప్రాధాన్యత పెరిగింది. పార్టీలో ఆమె వెన్నంటి వున్న ఎమ్మెల్యేలు, చిన్నా చితకా నాయకులు ఆమెకు బ్రహ్మరథం పడ్తున్నారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో ఆమె సారథ్యంలో చంద్రబాబుకు బుద్ధి చెప్తామని లక్ష్మిపార్వతి అనుచరగణం ప్రగల్భాలు పలుకుతోంది. ఈ పరిణామాలతో డాక్టర్ దగ్గుబాటి నామమాత్రుడై పోయినట్లే భావిస్తున్నారు. ఎన్టీఆర్‌తో నేరుగా మాట్లాడలేని వారు ఇప్పటి వరకు దగ్గుబాటి సాయం కోరుతుండే వారు. ఇప్పుడిక ఆ పాత్రను కూడా లక్ష్మిపార్వతే పోషించ నుంది. పైగా దగ్గుబాటి ఎప్పటికైనా తనకు రాజకీయంగా అడ్డు వస్తాడన్న అనుమానం ఆమెకుంది. కొట్టకుండా, తిట్టకుండా పొగబెడితే ఆయనే బయటకు వెళ్తాడ్లే అన్న ధోరణిలో రాజకీయాన్ని నడపాలని లక్ష్మిపార్వతి యోచిస్తోంది. ఏమైతేనేం మరోసారి రామారావు తెలుగు దేశం కోటకు పగుళ్ళ తప్పేట్లు లేదు.

50 ఏళ్ళ క్రితం

3 పేజీ కొరవ

అములూరు కమ్మల మర్యాదేగిన తుపాన్ను, చంద్రమౌళి కమ్మగారు ఉపశాంతింప జేయమని వేడుకొంటాం.

పరమరహస్యం

మీకొక పరమ రహస్యం చెబుతాను. బైటకు రానియ్యరు గదా!

వెంకటగిరి రాజా సాహెబ్‌ల వారు జనానాతో, పుత్రునితో, నెల్లూరుకు వేంచేసినారు కుమారుని కన్యాన్వేషణ సందర్భంగా.

అమ్మాయి పిఠాపురం (చిత్రాడ) నుండి వచ్చి వేదాంతాచారి గారి యింట్లో సపరి వారంగా దిగి దర్శనమిచ్చి వెళ్ళి పోయింది. సరిపడితే విశ్వితార్థం చేసుకోవచ్చు. ముందుగానే ఆమె జాతకం చూచిన వారు గొప్పదంటారు తర్వాత అమ్మాయి జాతకం మంచి దంటాను నేను.

నా సలహా యేమిటంటే?

అంద చందాలలోనే గాక, గుణగణాల్లో గూడా ఉత్తము రాలైన అబ్బాయి మేనత్త కూతురైన, పెద పవని పుత్రికను స్వీకరించటం ఉత్తమోత్తమం అవి తర్వాత మీ యిష్టం "చింత కాయలకు అజ్జ గాని గుటకలకు గూడా అజ్జా?" అన్నట్లు విని వినక పోయినా మంచి సలహా చెప్పడానికి గూడా మీ ఆక్షేపణ ముంది?

కల్తీకేసులు

పాలల్లో నీళ్లు పోసినందుకు కాదు. నీళ్ళల్లో పాలు పోసినందుకు

పాలు పద్మాక్షమ్మకు	రు. 50.0.0
వెదిచర్ల నారాయణరెడ్డికి	75.0.0
డిటో	125.0.0
పాటూరు చిట్టంశెట్టి శంకరమ్మకు	100.0.0
పంటా మహాలక్ష్మమ్మకు జమ్మిపాళెం	50.0.0
కె. రామమూర్తి హోటల్ అళ్ళుభతకు	50.0.0
రామమూర్తి (వీధిలో బండితో అమ్ముటకు దమ్ము. ధూళికి)	20.0.0
చెక్కా చెన్నకేశవులకు (డిటో)	10.0.0

జుల్మానాలు విధించబడెను.

చక్కెరకు బదులు యిసుక బస్తా

ఈ మధ్య చక్కెరకు మాంచి గిరాకి. స్టోన్ హౌసుపేట పంచదార శెట్టి దుకాణం ముందు జరిగిన యుద్ధంలో తగిలిన లాఠీ దెబ్బల తీపు చక్కెర తీపు కంటే హెచ్చుగానే యున్నదని అనుభవజ్ఞులన్న మాట ఆ దినాల్లో.

ఈలాటి పంచదార క్షామ దినాలలో మోసగాడనే పెద్దమనిషి మాంచి కల్లు యిసుక బస్తా నిండా పోసి కుట్టి బజారుకు దెచ్చి రహస్యంగా అమ్మజూపగా ఒక కాఫీ దుకాణం పెద్దమనిషి అనే మోసగాడు రు. 47 లు యిచ్చి లటక్కన కొట్టేశాడు ఆ బస్తాను.

తీరా లోపలకు వెళ్ళి మూతి విప్పితే పెన్నలో తయారైన పరిశుద్ధమైన ఇస్కాను బోలిన యిస్కా, దొంగకు తేలు కుట్టినట్లు గప్‌చిప్.

\- విమర్శకుడు

జనవాణి

3 పేజీ కొరవ

9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు, లేకుంటే ఉదయం 10 నుండి 12 వరకు కోతవేళలను మారిస్తే బాగుంటుంది.

నెల్లూరు -ఎం.అలీ

వాగ్దానాలు సాధ్యమా సిఎం గారూ!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్ర విచిత్రమైన వాగ్దానాలు చేసేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఖజానా ఖాళీ అయి పోయిందన్న విమర్శలు వినవస్తున్నా ఆయన అవన్నీ పట్టించు కోవడం లేదు. రెండు రూపాయల కిలో బియ్యాన్ని ఇక నుంచి ఇంటి వద్దకే అంద జేసేందుకు పథకం రూపొం దిస్తున్నట్లు ఇటీవల ఆయన ప్రకటించారు. కాని ఈ పథకం అమలులో ఏర్పడే సాధ్యా సాధ్యాలను అంచనా వేసినట్లు లేదు. ఈ బియ్యాన్ని కొనేది అల్పాదాయ వర్గాల వారు. వీరికి ప్రభుత్వోద్యోగులకు లభించినట్లు నెలాఖరుకు లేదా నెల ప్రారంభంలో జీతాలు రావు. సబ్సిడీ బియ్యాన్ని ఇళ్ల వద్దకు తీసుకొచ్చినా కొనేందుకు డబ్బు ఉంటుందో లేదో ఎవరు అంచనా వేయగలరు. ముఖ్య మంత్రి ఈ పథకాన్ని ప్రకటించే ముందు కాసింత ఆలోచించి వుంటే బాగుండేది.

విడవలూరు -సి. కరుణాకర్

సినిమా

9 పేజీ కొరవ

ఏర్పాటు చేశారు. "ఏక్షన్!" అని డైరక్టర్ చెప్పక ముందే నేను అమాంతంగా దూకేశాను. ఏమైందని అందరూ గాభరా పడ్డారు. ఆ నల్లిచెట్టు మీద ఒక ఆకు పురుగు కనిపించింది. నా గుండె దారెత్తి పోయి, వెంటనే దూకేశాను. నా చిత్రాలంటే చాలా ఇష్టమని శేషన్ చెప్పినట్లు ఏదో పత్రికలో చదివాను. నాకు మాత్రం పార్లమెంట్‌లోని ఆ లంకంత భవనం ఎంతో నచ్చింది" అంది శ్రీదేవి నవ్వుతూ.

రాజేంద్రప్రసాద్ "ముక్కోపం"

హీరో రాజేంద్ర ప్రసాద్‌కు కొందరు పెట్టిన మారు పేరు దూర్వాసుడు. ఉన్నట్టుండి అతనికి కోప మొస్తూంటుంది. కాస్సేపటి వరకు అతన్ని పలక రించడానికి అందరూ భయపడు తుంటారు. ఒకప్పుడు అతని పక్కన నాయిక వేషం వేసే హీరా ప్రతి రోజూ ఆలస్యంగా హాజరయ్యేది. ఈయన మేకప్ వేసుకొని రెడీగా వుండేవారు. ఒక రోజు భరించలేక ఆమె మీద ఎగిరి పడ్డారు. "ఏమిటి మీ స్వభావం! మాకు మాత్రం ఇంటి దగ్గర పనీ పాటా లేవా? ప్రతి రోజూ ఎంత సేపని ఎదురు చూడడం?" అంటూ పటపట మని నాలుగు మాటలు అడిగేశారు. ఆమె ఆ చిత్ర నిర్మాత వంక, డైరక్టర్ వంక చూసింది. ఎవ్వరితో మాట్లాడ కుండా వెనుతిరిగి మేకప్ గదికేసి వెళ్లింది. మేకప్ తీసేసి కారులో తుర్రుమంది. డైరక్టరూ, ప్రొడ్యూసరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఇంతలో రాజేంద్ర ప్రసాద్‌కూ కోపం తగ్గిపోయింది. హీరా షూటింగ్‌కు రావడం మానేస్తే నిర్మాత ఎంతో నష్టపోతాడని గ్రహించారు. "కోపంతో ఏదో అన్నాను. నటుస్రైన అలా అనడని మాటిచ్చానని హీరాకు చెప్పి పంపండి" అని నిర్మాతతో చెప్పారు. నిర్మాతే వెళ్లి చెప్పారు. దానితో హీరా చల్లబడింది. మర్నాటి నుంచి షూటింగ్‌కు సకాలానికే హాజరవడం మొదలెట్టింది. "ఇప్పుడు నాకు కోపం కాస్త తగ్గింది" అంటారు రాజేంద్ర ప్రసాద్.

ప్రేమరాయుడు

విడమర్తి సత్యం, పాత్రోయుడు వాశిరాజు ప్రకాశం "ప్రేమ రాయుడు" పేర ఓ చిత్రాన్ని తెనిగిస్తున్నారు. రజనీ కాంత్, మాధురీ దీక్షిత్ నాయికా నాయకులు. మాటలు: వసంత్ కుమార్. సంగీతం: లక్ష్మీకాంత్ ప్యారేలాల్. నిర్వహణ: కె.ఎం. నాయుడు. దర్శకత్వం: ప్రభాత్ ఖన్నా.

నరలోకవీరుడు - నాగలోక సుందరి

దుమ్ముం దుమ్ముం చిత్రాలతో విసుగెత్తి పోయిన ప్రేక్షక లోకానికి ఊరట

సాయిగంగ

రసిక్

అంతులేనట్టి దాహమనంతపురిని
ఏండ్లు మీరగ, మీరుచునెసగుచుండె;
దానిపైబడె సాయిదృగ్ధారసుంత-
పల్లిపల్లెను ప్రవహించె వారి ధార.

"పేరు రాయలసీమ - పేర్చెద్దరికమె
త్రావ నీరమ్ము లేనట్టి రాళ్ళసీమ"
అనుచు ప్రజలీసడింపంగ కినుకగానెనొ
'సాయిసీమ' య్యెపారంగ 'సాయిగంగ'

బాలువారు గంగ సాయి కౌశల్యంబు
బాలువారు గంగ సాయి కరుణ,
బాలువారు గంగ సాయి ప్రేమరసము
అనినుతింత్రు జనము హాయి మీర

సాయి సప్తతి వేళ లక్షల కొలంది
పుట్టపర్తికి చనుదెంచి పుడమి జనులు
సాయిగని, విని, మేల్కాంచి, సాగిలబడి
అర్ఘ్యమొనరించెదరు కోటానుకోట్లు

సాయికిడిన సొమ్ము జలకష్టము దీర్చు.
స్వామి కిడిన కాన్క ఫలము లీను.
అనెడి నమ్మకమ్ము అవనిభక్తులకెల్ల;
వారినమ్మకమ్ము వమ్ముగాదు

ఎవని పల్కులు ప్రజలకు హితవు గఱపు
ఎవని చేతలు జనులకు హితముగూర్చు
ఎవని సంకల్ప బలము సాధించి చూపు
అట్టి అవతార పురుషుని కంజలింతు!

కల్గించడానికి ఇప్పట్లో జానపద చిత్రాలు నిర్మిస్తే గుడ్డిలో మెల్ల అని అభిప్రాయ పడినట్లున్నారు శరవణ వేలు కంబైన్స్ వారు. అందుకే సోషల్ ఫాంటసీ చిత్రాన్ని అక్టోబర్ 10 నుంచి మైసూరు పరిసరాలలో చిత్రీకరిస్తున్నారు. సినిమా స్కోప్ చిత్రం ఖర్చు ఎక్కువైనా తమిళంలో కూడా తీస్తే గండం గట్టెక్క వచ్చునని నిర్మాత ఎ. రామకృష్ణ తలంపు కాబోలు. "నరలోక వీరుడు - నాగలోక సుందరి" చిత్రంలో కె.ఆర్. విజయ, పి.జె. శర్మ, రఘునాథ రెడ్డి, నంబియార్,

నాగేశ్వ, సాక్షి రంగారావు, కె.కె. శర్మ, ప్రసాద్ శ్రీనివాస్, రేణుక, ఉజ్వల్, వై. విజయ, రవళి, సంగీత అభిరా గల వారుంటారు. పాటలు: సి. నారాయణ రెడ్డి, జాలాది, సీతారామ శాస్త్రి, గూడూరు విశ్వనాథ శాస్త్రి. సంగీతం: రాజ్. స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: టి.ఎస్.ఆర్ అంజనేయులు.

బి. నాగిరెడ్డి చిత్రం "నేటి సావిత్రి"

"ఎవరికి అన్యాయం జరిగినా తట్టుకొని తోటి స్త్రీకి న్యాయం జరిపే ఒక పవిత్ర పావని కథ తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి తయారౌతుంది" అన్నారు ప్రముఖ స్టూడియో అధినేత, ప్రచురణ కర్త, నిర్మాత బి. నాగిరెడ్డి. రేవతి నాయిక. మాటలు: ఆకెళ్ళ, పాటలు: వెన్నెల కంటి. సహ నిర్మాత: బి.ఎన్. సురేష్ రెడ్డి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: విసు.

ఊరికి మొనగాడు

"బస్తీలో పట్టభద్రుడై, తన పల్లెకు తిరిగొచ్చిన ఒక యువకుడు ఆ పల్లెలోని సమస్యల నెలా పరిష్కరించి ఊరికి మొనగాడు"గా నిలుస్తాడు అన్న అంశం పై పూర్తి గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తయారవుతోంది అన్నారు షిర్డి సాయి కృష్ణ ఫిలిమ్స్ అధినేత విజయ్. ఇందులో శ్రీకాంత్, సంఘవి, నీలిమ ముఖ్య పాత్రధారులు. సంగీతం: విద్యాసాగర్. దర్శకత్వం: యు. నారాయణ రావు.

మంజుల కుమార్తె నటించే "మైనా"

గతంలో పలు తెలుగు తమిళ చిత్రాలలో నటించిన మంజుల కుమార్తె ఇటీవల బాల తారగా కొన్ని తమిళ చిత్రాలలో నటించింది. ఉప్పలపాటి నారాయణ రావు దర్శకత్వంలో తయారయ్యే "మైనా" చిత్రంలో ఆ అమ్మాయి నాయికగా పరిచయం గావింప బడుతోంది.

నటుడు సురేష్‌కు మళ్ళీ పెళ్ళి


అనితారెడ్డి నుంచి విడిపోయిన హీరో సురేష్ తిరుపతిలో తనూజ అనే నటిని వివాహ మాడిన సందర్భంలో అక్టోబర్ 8 న మద్రాసులో రిసెప్షన్‌ను ఏర్పాటు చేశాడు అతని తండ్రి, దర్శక నిర్మాత ఎం.ఎస్. గోపినాథ్.

చిత్రసమీక్ష

9 పేజీ కొరవ

గురవుతున్న ఒక పసి పాపను రక్షిస్తాడు. అందుకు కృతజ్ఞతగా, ఆ పాప గార్డియనుగా వున్న క్రిస్టియన్ ఫాదర్ (వేలు) రాజాను పోలీసుల బారి నుండి కాపాడుతారు. మహిమలు గల ఒక టోపీని రాజాకిస్తారు. ఆ టోపీని తలమీద పెట్టుకుంటే మనిషి ఎవ్వరికీ కనిపించరు. ఆ టోపీని తల మీద పెట్టుకొని ఎవ్వరికీ కనిపించ కుండా, ఆ టోపీ మహత్యంతో తన మీద వచ్చిన నింద నుంచి బైట పడతాడు రాజా. ఆ టోపీ రాజా తన స్వీటీ రోజాని హాయిగా చేరుకుంటాడు.

ఈ చిత్ర దర్శకుడైన డా. ఎస్. శివ ప్రసాద్ ఈ కథను వ్రాశారు. కథాంశం కొత్తది కాకపోయినా దర్శకుడు పాత్రలను, సన్నివేశాలను వినోదాత్మకంగా నడిపాడు. రోజా, రాజా ప్రేమను పొందే వరకు ఎన్నో చిలిపి చేష్టలు, గిలిగింతలు పెడ్తూ సాగుతాయి. ఈ ప్రేమకు లిద్దరి మధ్య ఒక కోతి దూత రాయబారిగా వుండి మంచి హాస్యం సృష్టించింది. మహిమలు గల టోపీ గూడా హాస్యాన్ని అందించింది. టోపీ గాలిలోకి తేలడం, దానితో గూడా ఆ గదిలో వున్న వస్తువులు కూడా గాలిలో తేలటం, గ్లాసు తనంతట తానుగా నేరుగా వెళ్ళి నీళ్ళ కుండలో నీళ్ళు ముంచు కోవడం వంటి ప్రక్రియలు ప్రేక్షకుల్ని ఆశ్చర్యంతో ముంచి ఆ తర్వాత ఆనందంతో తేలుస్తాయి. ఇటువంటి హాస్య సన్నివేశాలతో నిండగా, ఈ చిత్రం అందర్నీ అలరించి వినోద భరితంగా సాగింది.



హాస్యం కోసం కొందరు దర్శకులు అసభ్యాన్ని, ద్వంద్వార్థాలను ఆశ్రయి స్తుంటారు. అలాంటి వాటికి చోటివ్వకుండా కుటుంబ సమేతంగా చూడ తగ్గ హాస్య వల్లరిని అందించారు దర్శకుడు డా. ఎస్. శివప్రసాద్.

నటీ నటులంతా హాస్యం కోసం కృషి చేశారు. రాజేంద్ర ప్రసాద్ మల్లికార్జున రావు, బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, బాబు మోహన్ ప్రత్యేకించి హాస్యం అందించారు. రాజేంద్ర కుమార్ మాటలు హాస్యాన్ని బాగా పులుము కున్నాయి. పి.ఎస్. ప్రకాష్ కెమెరా ప్రతి సన్నివేశాన్ని సొంపుగా చిత్రీకరించింది.

జమీన్‌రైతు
సంవత్సర చందా రూ. 100/-
అర్ధ సంవత్సరం చందా రూ. 50/-

కందుకూరు సబ్ జడ్జి వారి కోర్టులో

వేలం ప్రకటన

E.P. No. 20/1991 / ఒంగోలు D.M.C. O.S. No. 620/1979

1. పాటిబండ్ల సుబ్బయ్య (died)
2. పాటిబండ్ల రామచంద్రరావు వగైరా -డిక్రీహోల్డర్లు

1. చిమ్మిరి రామకృష్ణయ్య (died)
2. చిమ్మిరి నరసింహ రావు వగైరా -జడ్జిమెంటు డెటార్లు

యిందలి జడ్జిమెంటు డెటార్లు వల్ల డిక్రీ హోల్డర్లకు రావలసిన మొత్తమునకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా జడ్జిమెంటు డెట్టార్ల స్థిరాస్తిని 7.12.95 తేది పగలు 10.30 గంటలకు పై కోర్టు వారి యెదుట వేలం జరుప బడును. కావలసిన వారు కోర్టు వారి వల్ల జరుపు వేలం పాటలో పాల్గొని పాడుకొన వచ్చును.

E.P. షెడ్యూలు

ప్రకాశం జిల్లా సింగరాయ కొండ సబ్ రిజిస్ట్రేషన్ కలికివాయి - చీట్లగుంట గ్రామంలో

1) సర్వే నం. 368 లోయ 1.13 సెంట్లు లేక హె.0.446 మెట్టభూమి దీనికి హద్దులు.
తూ: చిమ్మిరి మాల్యాద్రి భూమి; ద: చిమ్మిరి మాల్యాద్రి భూమి; ప: డొంక; ఉ: చిమ్మిరి మాల్యాద్రి భూమి.
వాది క్రయం రూ. 1,000/- అమీనా క్రయం రూ. 2260/-

2) సర్వే నం. 580/A లోయ 3.17 సెంట్లు లేక హె. 1.26 లు మెట్టభూమి దీనికి హద్దులు.
తూ: పట్టపు యల్లమంద గువ్వాడి వెంకటేశ్వర్లు వగైరాల భూములు; ద: మిత్రడి కొండయ్య కుమారుడు పెద రాగయ్య యేసోబు యూతముక్కల శాంసన్ గార్ల పట్టా పొందిన భూములు; ప: పట్టపు యల్లమంద గువ్వాడి వెంకటేశ్వర్లు వగైరాల భూములు; ఉ: మూసివాగు.
వాది క్రయము: 3,000/- అమీనా క్రయము: 6,340/-

3) సర్వే నెం. 215/1 రులో య0.41 సెంట్లు లేక హె. 0.166 లు మాగాణి భూమి దీనికి హద్దులు.
తూ: చిమ్మిరి నరసింహ రావు భూమి; ద: మామిళ్ల వెంకటేశ్వర్లు భూమి; ప: దాసరి చెంచయ్య భూమి; ఉ: రోడ్డు.
వాది క్రయము రూ. 1,000/- అమీనా క్రయము రూ. 8,200/-

4) సర్వే నెం. 227 రులో య0.18 1/3 సెంట్లు లేక హె0.73లు మాగాణి భూమి. దీనికి హద్దులు.
తూ: కుండా లక్ష్మారెడ్డి భూమి; ద: పంట కాలువ; ప: చేజర్ల అంజయ్య భూమి; ఉ: ఆళ్ల కోటరెడ్డి భూమి.
వాది క్రయము : 500/- అమీనా క్రయము: [illegible]

5) సర్వే నం. 256 రులో య 0.22 సెంట్లు లేక హె. 0.09 లు మాగాణి భూమి దీనికి హద్దులు.
తూ: పంట కాలువ; ద: పంట కాలువ; ప: బొర్రా కోట్లింగం వగైరాల భూమి; ఉ: బొర్రా కోట్లింగం వగైరాలు భూమి.
వాది క్రయము: రూ. 500/- అమీనా క్రయము: రూ. 4,400/-

6) సర్వే నెం. 210రులో య0.32 2/3 సెంట్లు లేక హె. 0.13లు మెట్టభూమి దీనికి హద్దులు.
తూ: చిమ్మిరి నరసింహ రావు. మాల్యాద్రి లక్ష్మి [illegible] గార్ల స్థలములు; ద: డొంక; ప: కనుమూరి రామభద్ర రాజా. కనుమూరి [illegible] రాజా గార్ల భూములు; ఉ: [illegible] వెంకయ్య భూమి.
వాది క్రయము: 500/- అమీనా క్రయము: 6,400/-

కందుకూరు
523105

కె.వి. లక్ష్మినారాయణ
డిక్రీహోల్డరు వారి తరపు అడ్వకేటు



సంస్మరణ

ప్రముఖ మైకామైనర్, మా తండ్రి

దొడ్ల నారపరెడ్డి గారు

(గూడూరు)

పరమపదించి **1.12.95** తేదికి
5 సంవత్సరములు నిండుతాయి

పంచమ వర్ధంతి

సందర్భంలో వారిని స్మరిస్తూ...

దొడ్ల సుకుమార్ రెడ్డి

సంస్మృతి

మా ఇంటి దైవం, మా అభివృద్ధి కారకులు

దొడ్ల నారపరెడ్డి గారు

మైకామైనర్ - గూడూరు

లేని లోటు ఈనాటికీ మాకు ఎవరూ తీర్చలేనిది.
వారిని సంస్మృతిస్తూ (1.12.95 తేది)
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య: దొడ్ల సరోజనమ్మ

అల్లుళ్లు - కుమార్తెలు

డాక్టర్ ఎన్.ఆర్.సాయికుమార్ - డా. ఉషాకిరణ్
ఎమ్. రవీంద్రనాథ్ - శోభారాణి

మనుమలు - మనుమరాండ్రు



మరణం: 1.12.90

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Offset Printing at Nayagara Paper Products (I) Ltd.